E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 12-05-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:130|| పేజీలు–6
www.ekaburu.com

టీఆర్ఎస్ జెండాపండుగ

రాష్ట్ర రాజధాని నుంచి వార్డు స్థాయి వరకు పార్టీ జెండాలు ఆవిష్కరించాలి
పార్టీ శ్రేణులకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

03

భారత్ ఎవరికీ తలవంచదు

ఏ ప్రపంచశక్తీ భారత ప్రగతిని అడ్డుకోజాలదు
సోమనాథ్ అమృత్‌మహోత్సవ్ కార్యక్రమంలో మోదీ వ్యాఖ్య
సోమనాథ్ ఆలయంలో మహాపూజ చేసిన ప్రధాని
వీర్ హమీర్జీ సర్కిల్ వద్ద భారీ రోడ్‌షో
ఆకట్టుకున్న సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం వైమానిక విన్యాసాలు

ఈ-కబురు,సోమనాథ్(గుజరాత్): అమెరికా వంటి అగ్రరాజ్యాలకు సైతం ఏమాత్రం బెదరక భారత్ తన లక్ష్యసాధనలో సఫలీకృతమైందని ప్రధాని మోదీ శ్లాఘించారు. 1998లో పోఖ్రాన్ అణుపరీక్షలపై అమెరికా ఒత్తిళ్లు ఉన్నప్పటికీ భారత్ ఏమాత్రం తన సంకల్పాన్ని సడలనివ్వలేదని మోదీ గుర్తుచేశారు.

మిగతా 2లో

ప్రజా జీవనంపై మోదీ అప్రకటిత నిషేధం

పొదుపు మంత్రం జపించిన ప్రధానిపై సీఎం రేవంత్ ధ్వజం
అసమర్థ పాలన, విదేశాంగ విధానంలో వైఫల్యాలు కప్పి పుచ్చుకునేందుకే 10 సూత్రాలు
గాలి తిని, గాల్లో బతకమని చెప్పి వెళ్లారు.. కేంద్రానికి దశ దిశ లేదు..
అనుభవ రాహిత్యం, అహంకారంతో దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారు
తమను వ్యతిరేకించే వారిని ఖతం చేయడమే బీజేపీ విధానం
మావోయిస్టులు, ముస్లింలు, కమ్యూనిస్టులు ఈ దేశ పౌరులు కాదా?
అధికారిక కార్యక్రమంలో ప్రధాని మాట్లాడిన దానికి రాజకీయాలతో సంబంధం లేదు
మీడియాతో ముఖ్యమంత్రి సుదీర్ఘ చిట్‌చాట్

దేశంలో సంక్షోభం తలెత్తే అంశాలపై రాహుల్‌గాంధీ ఆరు నెలల నుంచే చెబుతున్నా అంతా సవ్యంగా ఉందంటూ చెప్పుకొచ్చారు. కేంద్రానికి ఓ స్పష్టమైన విధానం లేదు. దశ, దిశ లేదు. అనుభవ రాహిత్యం, అహంకారంతో దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారు. గాలి తిని, గాల్లో బతకమని చెప్పి మోదీ వెళ్లిపోయారు. పశ్చిమాసియా యుద్ధంలో మనమేమీ ప్రత్యక్షంగా పాల్గొనడం లేదు..' అంటూ సీఎం విమర్శించారు. సోమవారం తన నివాసంలో ఆయన మీడియాతో సుదీర్ఘంగా చిట్‌చాట్ చేశారు.

మావోయిస్టులను చంపడమే బీజేపీ ఎజెండా

'బీజేపీ విధానాలను వ్యతిరేకించే వారిని ఖతం చేయడమే ఆ పార్టీ విధానం. ముస్లింలు, మావోయిస్టులు, కమ్యూనిస్టులు ఈ దేశ పౌరులు కారా? వారికి తమ సిద్ధాంతాలను చెప్పుకునే స్వేచ్ఛ లేదా? మావోయిస్టులను చంపడమే బీజేపీ ప్రభుత్వం ఎజెండాగా పెట్టుకుంది. మేము ప్రాణాలు తీయడానికి వ్యతిరేకం. మా సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వాళ్లను కూడా ఒప్పించి జనజీవన స్రవంతిలోకి తీసుకుని రావడానికి ప్రయత్నిస్తాం. మనుషుల ప్రాణాలకు మా ప్రభుత్వం విలువ ఇస్తుంది. దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన పార్టీ మాది. మనషులను చంపడం పరిష్కారం కాదు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు అత్యధికంగా తెలంగాణలోనే లొంగిపోయారు. 818 మంది మావోయిస్టులు రాష్ట్రంలో సరెండర్ అయ్యారు. వందలాది ఆధునాతన ఆయుధాలను అప్పగించారు. అందుకోసం మేం ప్రత్యేక చొరవ తీసుకున్నాం.

మేం బుల్లెట్ కాదు బ్యాలెట్ అన్నాం..

లొంగిపోయిన వారికి రక్షణ, వైద్యం, ఆర్థికపరమైన సాయం ప్రభుత్వం అందిస్తుంది. మావోయిస్టుల విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. భూ పంపణీ, ఉపాధి హామీ పథకాల అమలుతో వారి ఉద్యమాలు తగ్గాయి. గణపతి కూడా జన జీవన స్రవంతిలో కలవాలి. ప్రధానమంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసులను అభినందించకపోగా విమర్శించడం దురదృష్టకరం. బుల్లెట్ కాదు బ్యాలెట్ అని మేం అన్నాం. చివరకు మావోయిస్టులు మా లైన్‌కు వచ్చారు. ముస్లింలను వేరే చేసి చూపించడం మంచిది కాదు. కలిసి ఉండాలని ప్రధాని మాట్లాడాలి కానీ విడగొట్టాలని మాట్లాడం దురదృష్టకరం. బీజేపీ బ్రిటిష్ జనతా పార్టీ.. విభజించు, పాలించు అన్నదే వాళ్ల సిద్ధాంతం..' అని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. నేను అడిగిన అంశాలకు మోదీ అంగీకరించారు..

'ఆదివారం అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా నేను అడిగిన అంశాలకు ప్రధాని అంగీకరించారు. అందులో ఎలాంటి రాజకీయాలు లేవు. మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్‌కు సాయం చేసిన విధంగానే తెలంగాణకు కూడా మీరు సహకరించాలని కోరా. అందుకు ప్రధాని స్పందిస్తూ.. 'నీవొక్కడివే చేస్తే అనుకున్న లక్ష్యాలను (3 ట్రిలియన్ ఎకానమీ) సాధించలేవు. నీ కలలు నిజం అవ్వాలంటే మాతో కలిసి వస్తే.. అది సాధ్యం అవుతుంది' అనే విధంగా అన్నారు. అయితే ఆయన మాటలను ఎవరికి తోచిన విధంగా వారు అర్థం చేసుకుంటున్నారు. నేను బీజేపీని ఓడించే ముఖ్యమంత్రి అయ్యా.

మిగతా 2లో

> **ఈ-కబురు, హైదరాబాద్:** ప్రధాని మోదీ తన అసమర్థ పాలన, విదేశాంగ విధానంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజల జీవనంపై అప్రకటిత నిషేధం ప్రకటించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'బంగారం కొనొద్దు.. వెకేషన్‌కు వెళ్లొద్దు.. నూనె తినడం తగ్గించాలంటూ ప్రధాని ప్రజలకు పిలుపునివ్వడం బాధ్యతా రాహిత్యం. మోదీ ప్రభుత్వ వైఫల్యం, అసమర్థ విధానాలే ఇందుకు కారణం. విదే శాంగ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైంది. అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి సూచనలు సలహాలు తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు సరికాదు.

తమిళనాట విపక్ష కూటముల్లో కుదుపులు

తమిళనాట కొలువుదీరిన శాసనసభ
232 మంది ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
పళనిసామిపై అన్నాడీఎంకే ఎమ్మెల్యేల తిరుగుబాటు
స్టాలిన్, ముఖ్య నేతల ఇళ్లకు సీఎం విజయ్

ఈకబురు,చెన్నై: తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకేకు సొంత బలం చాలకపోయినా, ఇతర పక్షాలతో కలిసి అధికారం చేపట్టిన నేపథ్యంలో.. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. ఐదు దశాబ్దాలుగా రాష్ట్రాన్ని ఏలుతూ వచ్చిన రెండు ప్రధాన కూటముల్లో చీలికలు వస్తున్నాయి.

మిగతా 2లో

03

ఒడిస్సా టూ మహారాష్ట్ర.. వయా ఓఆర్ఆర్

అంతరాష్ట్ర గంజాయి సరఫరా ముఠా అరెస్టు
400 కిలోల గంజాయి స్వాధీనం

..3లో

గుప్తనిధుల కోసమే శివాలయం కూల్చివేత

03

..సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు విమర్శలు

ఈ-కబురు, హైదరాబాద్ : వరంగల్‌లో కాకతీయుల నాటి చారిత్రక శివాలయం కూల్చివేత ఘటనపై మాజీ మంత్రి.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బడులకు.. గుడులకు దిక్కులేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భగవంతుడంటే భక్తి.. భయం లేవని..

హైదరాబాద్ లో ప్రధాని మోడీ పై కాంగ్రెస్ నేత విహెచ్ ఫిర్యాదు

03

ఉత్తమ పాలసీలతోనే..

ఏపీకి పెట్టుబడులు

ఈ-కబురు,ఢిల్లీ, మే 11: ఉత్తమ పాలసీల రూపకల్పనతోనే ఏపీకి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించగలుగుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సీయింగ్ ఈజ్ బిలీఫ్ అనే విధానంలో ఏపీకి ఒక్కసారి వచ్చి చూసి అప్పుడు పెట్టుబడులు పెట్టాలని ఆయన పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని తాజ్ ప్యాలస్ లో భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించిన యాన్యువల్ బిజినెస్ సమ్మిట్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై కీలక ప్రసంగం చేశారు. దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో ఏపీ 25 శాతం మేర పెట్టుబడులను ఆకర్షించగలిగిందని ఆయన వివరించారు. గడచిన 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు ఏపీకి వచ్చాయని.. తద్వారా 24 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అన్నారు. భవిష్యత్ అవసరాలను అంచనా వేసి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ లాంటి సంస్థలతో కలిసి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. ఇప్పటికే క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీని కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. త్వరలో క్వాంటం కంప్యూటర్ కు అవసరమైన పరికరాలను కూడా ఉత్పత్తి చేసేలా కార్యాచరణ ప్రారంభించామని పారిశ్రామిక వేత్తలకు తెలియచేశారు.

మిగతా 2లో

విద్యకు బడ్జెట్‌లో 15% నిధులు

- రానున్న కాలంలో కేటాయిస్తాం
- మా ప్రభుత్వ తొలి ప్రాధాన్యం విద్యే
- డ్రాపవుట్స్ తగ్గించేందుకు పాఠశాలల్లో ఇంటర్
- విద్యా వారోత్సవాల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి

02

బండి భగీరథ్ కేసులో

దర్యాప్తు ముమ్మరం

డీసీపీ రితిరాజ్‌కు పర్యవేక్షణ బాధ్యతలు
నేడు మరోమారు బాధితురాలి వాంగ్మూలం నమోదు

ఈకబురు, హైదరాబాద్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు దర్యాప్తు ముమ్మరమైంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పర్యవేక్షణాధికారిగా నియమితులైన కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సోమవారం మధ్యాహ్నమే కేసు నమోదైన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంఘటన పూర్వాపరాలను సమీక్షించారు.

మిగతా 2లో

పంజాబ్ మళ్లీ.. దిల్లీ క్యాపిటల్స్ విజయం

06

తమిళనాట విపక్ష కూటముల్లో కుదుపులు



ఈకబురు,చెన్నై: తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకేకు సొంత బలం చాలకపోయినా, ఇతర పక్షాలతో కలిసి అధికారం చేపట్టిన నేపథ్యంలో.. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. ఐదు దశాబ్దాలుగా రాష్ట్రాన్ని ఏలుతూ వచ్చిన రెండు ప్రధాన కూటముల్లో చీలికలు వస్తున్నాయి. అన్నాడీఎంకే వంటి బలమైన పార్టీలో నాయకత్వ పోరు మొదలై వర్గాలు ఏర్పడ్డాయి. ఈ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే 47 స్థానాల్లో గెలుపొందింది. టీవీకేకు మెజారిటీ ఎమ్మెల్యేలు లేనందున ఆ పార్టీకి మద్దతివ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సీవీ షణ్ముగం నేతృత్వంలో 36 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు ప్రత్యేక శిబిరం పెట్టారు. చివరకు టీవీకేకు డీఎంకే కూటమిలోని పార్టీలు అండగా నిలవడంతో షణ్ముగం వర్గం అవసరం పడలేదు. ఇప్పటికీ, విడిగా ఉంటున్న ఈ వర్గంతో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి పలుమార్లు చర్చించినా, ఫలితం కన్పించలేదు.

పళనిసామి పార్టీ నాయకత్వ బాధ్యతలు వదులుకోవాలని, శాసనసభాపక్ష నేతగానూ ఉండొద్దని షణ్ముగం వర్గం వాదిస్తోంది. సోమవారం అసెంబ్లీ సమావేశాల తొలిరోజు 17 మంది ఎమ్మెల్యేలు మాత్రమే పళనిసామి వెంట ఉన్నారు. వీరు తమ పార్టీ పక్షనేతగా ఆయన్ను గుర్తించాలంటూ అసెంబ్లీ కార్యదర్శికి లేఖ సమర్పించారు. విడిగా ఉన్న 30 మంది ఎమ్మెల్యేలు ఏఐఏడీఎంకే పక్షనేతగా ఎస్పీ వేలుమణి ఉండాలని లేఖ ఇచ్చారు. ఈ వర్గంలో షణ్ముగం, వేలుమణి, సి.విజయభాస్కర్ తదితర కీలక నేతలున్నారు. ఈ రెండు గ్రూపుల్లో ఎవరు సూచించిన వారు పార్టీ పక్షనేత అవుతారన్నది స్పీకర్ ఎన్నిక తర్వాత తేలనుంది. పార్టీలో చీలికను అన్నాడీఎంకే కీలకనేత కేసీ పళనిసామి ధ్రువీకరించారు. జయలలిత మరణానంతరం ఆ పార్టీ నుంచి కీలక నేతలు శశికళ, ఒ.పన్నీరు సెల్వం, పన్రుట్టి రామచంద్రన్, పుహళేందితో పాటు కొందరు ఎమ్మెల్యేలు బయటకు వెళ్లారు. ఇప్పుడు వివాదాలు ముదరడంతో మరికొందరు కూడా కలిసి వేరుకుంపటి పెట్టొచ్చని వార్తలొస్తున్నాయి. ఈ వ్యవహారంపై మిత్రపక్షం భాజపా మౌనంగా ఉంది.

ప్రభుత్వ ఏర్పాటుకు సరిపడా బలాన్ని విజయ్‌కు సమకూర్చడంలో కాంగ్రెస్‌తో పాటు సీపీఐ, సీపీఎం, వీసీకే, ఐయూఎంఎల్ కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. స్థానిక పార్టీలు ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందు డీఎంకే అధినేత స్టాలిన్‌తో చర్చించాయి. కాంగ్రెస్ మాత్రం పొత్తుధర్మాన్ని విస్మరించి ముందుగానే టీవీకేతో జట్టుకట్టింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పిన డీఎంకే.. ఇకపై తాము ఇండియా కూటమిలో ఉండబోమని ప్రకటించింది. మున్ముందు జాతీయ రాజకీయాల్లో డీఎంకే వైఖరి ఎలా ఉండొచ్చన్న ప్రశ్నలు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ.. టీవీకేను ఇండియా కూటమిలోకి ఆహ్వానించి, దక్షిణాది రాష్ట్రాల్లో ఆయన సేవలు వాడుకోవాలని యోచిస్తున్నట్లు చర్చ నడుస్తోంది.

తమిళనాట కొలువుదీరిన శాసనసభ

తమిళనాడు ముఖ్యమంత్రిగా ఆదివారం బాధ్యతలు చేపట్టిన టీవీకే అధినేత సి.జోసెఫ్ విజయ్.. ఆ హోదాలో సోమవారం తొలిసారి శాసనసభలో అడుగుపెట్టారు. రాష్ట్ర 17వ అసెంబ్లీ తొలి సమావేశం సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైంది. పెరంబూర్ ఎమ్మెల్యేగా విజయ్‌తో ప్రొటెం స్పీకర్ కరుప్పయ్య తొలుత ప్రమాణం చేయించారు. ఆనక మంత్రులు, అధికార, విపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. కొందరు గెలుపు ధ్రువీకరణ పత్రం మరచిపోయి రావడంతో వారి ప్రమాణ స్వీకార ప్రక్రియ ఆలస్యమైంది. అన్నాడీఎంకే మాజీ మంత్రి సీవీ షణ్ముగం మినహా 232 మంది ప్రమాణం చేశారు. గవర్నర్ నిర్దేశం మేరకు ఈ నెల 13న అసెంబ్లీలో బలనిరూపణ జరగనుంది. ఈ సమావేశాల్లో విజయ్ వస్త్రధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీఎంగా ప్రమాణ స్వీకారం వేళ నలుపు కోటు ధరించిన విజయ్.. శాసనసభకూ అదే వస్త్రధారణతో వచ్చారు. 'బీస్ట్' చిత్రంలోని ఆ డ్రెస్ కోడ్ విజయ్‌కు ఎంతో నచ్చిందని, ఎన్నికల ఫలితాలు రాగానే కాస్ట్యూమ్ డిజైనర్ సఫిర్ అహ్మద్‌తో కోట్, సూట్‌ను డిజైన్ చేయించారని సమాచారం.

స్టాలిన్, ముఖ్య నేతల ఇళ్లకు సీఎం విజయ్

తొలిరోజు శాసనసభ సమావేశాల తర్వాత సీఎం విజయ్.. డీఎంకే అధినేత స్టాలిన్ నివాసానికి వెళ్లారు. అక్కడ ఉదయనిధి స్టాలిన్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎండీఎంకే నేత వైగో, పీఎంకే నేత అన్బుమణి రామ్‌దాస్‌ల ఇళ్లకు వెళ్లి వారిని కలిశారు. తమిళనాడులో ఈ దఫా టీవీకే అధికార పక్షంలో కూర్చోగా చాన్నాళ్ల తర్వాత డీఎంకే, అన్నాడీఎంకేల సభ్యులు ప్రతిపక్షంలో కూర్చున్నారు. తొలిసారి రెండు ద్రవిడ పార్టీలూ ప్రతిపక్ష పాత్రలోకి వచ్చాయి.

భార్యను పశువులా చూడొద్దు

... గృహహింస కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు

ఈకబురు,: గృహహింస కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యను భర్త పశువులా చూడకూడదని, ఆమెకు గౌరవంతో జీవించే హక్కు ఉందని స్పష్టం చేసింది (Domestic Violence Case). గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారించింది. అనంతరం అతడి అభ్యర్థనను తోసిపుచ్చింది. గతంలో పట్నా హైకోర్టు కూడా ఆ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. నిందితుడు మద్యం మత్తులో దాడి చేశాడని బాధితురాలి తరపు న్యాయవాది కోర్టు లో వాదనలు వినిపించారు. నేలపైకి తోయడంతో ఇటుక తగిలి ఆమె తలకు గాయమైంది. ఆ తర్వాత కర్రతో కూడా దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. మరోవైపు నిందితుడు మూడు వివాహాలు చేసుకోగా.. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితురాలు మొదటి భార్య. వాదనలు విన్న న్యాయస్థానం.. ''మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు..? ఇలాగే వేధిస్తే.. ఆమె మిమ్మల్ని వదిలి వెళ్లిపోతుంది. రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి'' అంటూ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

ప్రజా జీవనంపై మోదీ అప్రకటిత నిషేధం

నన్ను కాదు..రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకెళ్తానని మోదీ అన్నారు.

ఆశించిన స్థాయిలో సహకారం అందడం లేదు..

రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ సమన్వయంపై మేం చర్చించాం.. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సిందే..అది హక్కు. వాటిని సాధించుకుంటాం. కేంద్రంతో సత్సంబంధాలు లేకుండా నిధులు అడగకుండా ఉంటే రాష్ట్రం ఏ విధంగా ముందుకెళ్తుంది? కానీ కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించడం లేదు. కొన్ని అంశాల్లో సహకరిస్తున్నా.. మంత్రులను కలిసి ఎన్నిసార్లు అడిగినా అనుమతులు రావడం లేదు. రాష్ట్రాల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ప్రధాని కార్యాలయంలో సింగిల్‌విండో ఏర్పాటు చేయాలి..' అని రేవంత్ విజ్ఞప్తి చేశారు.

'చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గాల పునర్విభజన, జమిలి ఎన్నికలకు ఎలాంటి అడ్డంకి లేదు. నియోజకవర్గాల పెంపునకు సంబంధించి కేంద్రం అనుసరించే విధానంపైనే ప్రతిపక్ష పార్టీలన్నింటికీ అభ్యంతరాలు ఉన్నాయి. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు, నియోజకవర్గాల పెంపునకు ముడిపెట్టడంతోనే బిల్లు వీగిపోయింది. 50 శాతం సీట్ల పెంపునకు ఎలాంటి ఫార్ములా లేదు. 2029లో జమిలి ఎన్నికలు, మహిళా రిజర్వేషన్లు అమలు కావొచ్చు. అయితే బీజేపీ ఎన్నికల విధానం అంతా జెమినీ సర్కస్‌లా ఉంటుంది. తెలంగాణలో అధికారంలోకి వస్తామని ప్రధాని అన్నారు. వారిష్టం.. అనందపడనివ్వండి. రెండు సీట్లతో ప్రస్థానం ప్రారంభించిన బీజేపీ భవిష్యత్తులో మళ్లీ ఆదే రెండు సీట్లకు పరిమితం అవుతుంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కూడా మాకు ఒక రాష్ట్రం వస్తే.. వారికి ఒక రాష్ట్రం అదనంగా వచ్చింది అంతే. కేరళలో 3 సీట్లు ,తమిళనాడులో 2 సీట్లు మాత్రమే బీజేపీ గెలుచుకుంది..' అని సీఎం వ్యాఖ్యానించారు.

విద్యకు బడ్జెట్‌లో 15% నిధులు

ఈకబురు, హైదరాబాద్, నారాయణగూడ, న్యూస్‌టుడే: తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యం విద్యేనని.. రాష్ట్ర బడ్జెట్‌లో రానున్న కాలంలో 15 శాతం విద్యా శాఖకు కేటాయించనున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్కారు బడి అంటే అమ్మ ఒడి అని.. పేదపిల్లలకు నాణ్యమైన విద్య అందించే దేవాలయమన్నారు. పేదింటి బాలలకు విద్యాబుద్ధులు చెప్పడంతో పాటు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో విద్యావారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. క్యూర్ పరిధిలో రూ.1,761 కోట్లతో నిర్మించనున్న పాఠశాలలకు ఇక్కడి నుంచే సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''మా చిన్నప్పుడు ప్రభుత్వాలు నాణ్యమైన విద్యను అందించకపోతే.. నేను ముఖ్యమంత్రిగా మీ ముందు నిలబడకపోయే వాడిని.. ఈ వేదికపై ఉన్నవారిలో 90శాతం మంది ఇక్కడుండేవారు కాదు.. ప్రస్తుతం వేర్వేరు కారణాలతో సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడడం లేదు. అందుకే విద్యార్థులకు చదువు చెప్పడమంటే బరువుగా కాదు.. బాధ్యతగా భావిద్దాం. టీచర్ అంటే ఉద్యోగం కాకుండా భావోద్వేగంతో వారితో మాట్లాడదాం. రెండేళ్ల నుంచి చేపట్టిన సంస్కరణల కారణంగా విద్యలో మార్పులొస్తున్నాయి.

విద్యార్థుల్లో నైపుణ్యాలు గుర్తించే టీచర్లను సత్కరిద్దాం..

ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి వరకూ ఎలాగోలా చదువుకుంటున్నా.. ఇంటర్‌లో డ్రాపవుట్స్ పెరుగుతున్నాయి. వీటిని తగ్గించేందుకు కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకూ బోధించే ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నాం. వాటిలో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించనున్నాం. అల్పాహారంతో పాటు పిల్లలకు రాగి జావ, పాలు కూడా ఇవ్వనున్నాం. సర్కారు బడులు, యంగ్ ఇండియా స్కూళ్లలో చదువుకున్నవారు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా మారి సర్కారు బడుల్లో చదువుకున్నానని గుండె ధైర్యంతో చెప్పాలి. తెలంగాణ ముఖ్యమంత్రిని అవుతానన్న ఆత్మవిశ్వాసం వ్యక్తం చేయాలి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వివక్షకు గురవుతున్నామన్న భావనతో ఉస్మానియా, కాకతీయ విద్యార్థులు తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. వారి ఉద్యమాలతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని వర్సిటీలను పునరుద్ధరిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో 11 వేలకుపైగా టీచర్లను నియమించాం. ప్రస్తుతం రాష్ట్రంలో 1.05 లక్షల మంది ఉపాధ్యాయులున్నారు. జాతీయ విద్యావిధానం ప్రకారం 30మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలి. మన రాష్ట్రంలో 17 మందికి ఒక ఉపాధ్యాయుడున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన టీచర్లున్నా ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు.. అక్కడ ఏమంత గొప్పగా ఉంది? మన లోపాలేంటి? అని ప్రశ్నించుకుని ముందుకు వెళ్దాం. విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించే టీచర్లను అభినందిద్దాం. జూన్ 2, డిసెంబరు 9న వారిని సత్కరిద్దాం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చాటిన పది, ఇంటర్ విద్యార్థులతోపాటు హెడ్‌మాస్టర్లు, పాలిటెక్నిక్ అధ్యాపకులకు సీఎం రేవంత్‌రెడ్డి నగదు బహుమతులు అందజేశారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, విద్యాశాఖ అధికారులు, వివిధ విశ్వవిద్యాలయాల వీసీలు తదితరులు పాల్గొన్నారు.

గత ఎక్సెస్ టెండర్లపై సీబీఐ విచారణకు సిద్ధమా?

హామ్ రోడ్ల టెండర్లలో అన్నీ ఎక్సెస్ అని హరీశ్‌రావు వ్యాఖ్యానిస్తున్నారు. 26 శాతం లెస్‌కు వచ్చిన విధంగానే అందరికీ ఇవ్వాలని అంటే.. గతంలో వారు ఎక్సెస్‌కు ఇచ్చిన టెండర్లన్నింటిపై సీబీఐ విచారణకు సిద్ధమా? నాకు ఎవరిపైనా కక్ష లేదు. తప్పు చేసిన వారిని న్యాయస్థానాలు శిక్షిస్తాయి..' అని సీఎం వ్యాఖ్యానించారు. మీ విషయంలో అలా జరగలేదు కదా అని ఓ విలేకరి ప్రశ్నించగా..

అడవికి రాజునని, వేటాడి చంపే మృగం బలం ఉన్నప్పుడు అలా వ్యవహరించినా.. శక్తి లేనప్పుడు పొదల మాటున, రాళ్ల మాటున దాగి మరణిస్తుందని అంటూ ఇది ఎవరినీ ఉద్దేశించి తాను వ్యాఖ్యానించడం లేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

బండి భగీరథ్ కేసులో దర్యాప్తు ముమ్మరం

ఈకబురు, హైదరాబాద్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు దర్యాప్తు ముమ్మరమైంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పర్యవేక్షణాధికారిగా నియమితులైన కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సోమవారం మధ్యాహ్నమే కేసు నమోదైన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంఘటన పూర్వాపరాలను సమీక్షించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు, ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల గురించి ఆరా తీశారు. భగీరథ్.. తన కుమార్తెను వేధిస్తున్నాడంటూ 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఈ నెల 8న కేసు నమోదైన సంగతి తెలిసిందే. మరోవైపు ఆ బాలిక, ఆమె తల్లి తనను డబ్బు కోసం బెదిరిస్తున్నారంటూ భగీరథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8వ తేదీనే కరీంనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు భరోసా కేంద్రానికి బాధితురాలు కేసు నమోదు సమయంలోనే బాధితురాలైన బాలిక నుంచి పోలీసులు వాంగ్మూలం నమోదు చేశారు. దీన్ని పరిశీలించిన డీసీపీ రితిరాజ్ మంగళవారం మరోమారు బాలికను భరోసా కేంద్రానికి పిలిపించాలని ఆదేశించారు. తన సమక్షంలోనే విచారించి మరోమారు వాంగ్మూలం నమోదు చేయనున్నారు. ఈ వాంగ్మూలాన్ని బట్టి అవసరమైతే ఇప్పటికే నమోదైన సెక్షన్లలో మార్పులు చేయడంగానీ, అదనపు సెక్షన్లు జోడించడంగానీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం బాధితురాలు ఇవ్వబోయే వాంగ్మూలానికి ప్రాధాన్యం ఏర్పడింది. పోలీసుల సమాచారం ప్రకారం.. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదును కూడా డీసీపీ రితిరాజ్ పరిశీలించారు. మైనర్ అయిన తన కుమార్తెను బండి భగీరథ్.. లైంగికంగా వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం, బెదిరించడం వంటి నేరాలకు పాల్పడ్డాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సమీక్ష

రాజకీయంగా దుమారం రేపిన ఈ కేసు దర్యాప్తు పురోగతిని సమీక్షించేందుకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. సోమవారం ఉదయం డీజీపీ ఆనంద్‌ను పిలిపించి పూర్వాపరాలను సమీక్షించారు. కేసు తీవ్రత దృష్ట్యా పర్యవేక్షణ బాధ్యతలను మహిళా అధికారికి అప్పగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దర్యాప్తులో ఎక్కడా అలసత్వం కూడదని, పారదర్శకంగా జరపాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తు పర్యవేక్షణ బాధ్యతలను డీసీపీ రితిరాజ్‌కు అప్పగిస్తూ... సైబరాబాద్ పోలీసు కమిషనర్ రమేశ్ ఉత్తర్వులు జారీచేశారు. దర్యాపు పురోగతిని రోజువారీ ప్రాతిపదికన తనకు సమర్పించాలని ఆదేశాల్లో సూచించారు. తనతో అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక చెబుతున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఫుటేజీతోపాటు ఆ సమయంలో వారితో ఉన్న ఇతరుల వివరాలు సేకరిస్తున్నారు.

ప్రణాళిక సిద్ధం చేశాం..: రితిరాజ్, డీసీపీ, కూకట్‌పల్లి

కేసు పురోగతిని తెలుసుకోవడానికి ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌తో సమీక్షించా. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో సమావేశంలో ఒక ప్రణాళిక సిద్ధం చేశాం. బాధితురాలి వాంగ్మూలం ఇప్పటికే రికార్డు చేశాం. మరిన్ని వివరాల కోసం మరోసారి ఆమె వాంగ్మూలం తీసుకుంటాం. గత రెండ్రోజుల్లో పోలీసులు కొన్ని ఆధారాలు సేకరించారు. ఈ కేసులో నిందితుడి గురించి సమాచారం సేకరిస్తున్నాం.

భారత్ ఎవరికీ తలవంచదు

ఈకబురు,సోమనాథ్(గుజరాత్): అమెరికా వంటి అగ్రరాజ్యాలకు సైతం ఏమాత్రం బెదరక భారత్ తన లక్ష్యసాధనలో సఫలీకృతమైందని ప్రధాని మోదీ శ్లాఘించారు. 1998లో పోఖ్రాన్ అణుపరీక్షలపై అమెరికా ఒత్తిళ్లు ఉన్నప్పటికీ భారత్ ఏమాత్రం తన సంకల్పాన్ని సడలనివ్వలేదని మోదీ గుర్తుచేశారు. గుజరాత్‌లోని ప్రభాస్ పాటన్‌లో అరేబియా సముద్ర తీరంలో ఆధునిక సోమనాథ్ ఆలయాన్ని పునర్‌నిర్మించి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా చేపట్టిన అమృత్‌మహోత్సవ్ కార్యక్రమాల్లో ప్రధాని మోదీ సోమవారం పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సద్భావన మైదాన్‌లో నిర్వహించిన 'సోమనాథ్ పునర్‌వైభవానికి 75 ఏళ్లు'సభలో మోదీ ప్రసంగించారు. ''1947లో భారత్ విదేశీపాలకుల నుంచి స్వాతంత్ర్యంపొందినప్పటికీ 1951లో సోమనాథ్‌లో ఆధునిక ఆలయంలో ప్రాణప్రతిష్ఠ జరిగిన క్షణంలోనే నిజమైన స్వేచ్ఛా స్ఫూర్తి దేశం నలుచెరుగులకూ వ్యాపించింది. సోమనాథ్‌లో జరుగుతున్న అమృత్ మహోత్సవం కేవలం ఒక స్మరణీయ కార్యక్రమం కాదు ఇది వచ్చే వెయ్యేళ్లపాటు మనకందించే స్ఫూర్తి సంబరం.

మే 11 అనగానే కేవలం ఆధునిక సోమనాథ్ ఆలయ పునర్‌నిర్మాణం గుర్తుకురాదు నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ నాయకత్వంలో 1998లో భారత్ చేపట్టిన అణుపరీక్షలూ ఇదే తేదీన జరిగాయి. ఇదే రోజున మన శాస్త్రవేత్తలు దేశ అణుశక్తి సామర్థ్యాలు, సత్తాను యావత్ ప్రపంచానికి చాటిచెప్పారు. అణుపరీక్షల భూప్రకంపనలు ప్రపంచదేశాల్లో వణుకుపుట్టించాయి. కొన్ని దేశాల్లో ఆగ్రహజ్వాలలను రగిల్చాయి. అణుపరీక్షలు చేసే హక్కు భారత్‌కు ఎక్కడి నుంచి వచ్చింది? అంటూ పలు దేశాలు హూంకరించాయి.

ఆర్థిక ఆంక్షల మాటున భారత్‌ను ఏకాకిని చేసే కుట్రలుచేశాయి. భారత్‌ను అణగదొక్కేందుకు ప్రపంచశక్తులు ఏకమయ్యాయి. కఠిన ఆంక్షలనూ ఇండియాపై మోపారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో ఇంకేదైనా దేశమైతే కూలబడేదే. కానీ భారత్ విభిన్నం. అన్నింటినీ తట్టుకుని భారత్ సగర్వంగా నిలబడింది. అంతర్జాతీయ సమాజం నుంచి ఒత్తిళ్లున్నా 13న మరోసారి అణుపరీక్షలుచేసింది. మే 11న శాస్త్రవేత్తలు తమ ఆరంభకార్యాలను పూర్తిచేయగా 13న మరోరెండు అణుపరీక్షలుచేసి వాజ్‌పేయీ సారథ్యంలో బీజేపీ ప్రభుత్వ రాజకీయ సంకల్పాన్ని రుజువుచేశారు''అని మోదీ అన్నారు.

మూలాలు మర్చిపోవద్దు

''మూలాలను మర్చిపోయిన దేశం పటిష్టంగా ఉండలేదన్న సత్యాన్ని సోమనాథ్ మనకు ప్రబోధిస్తోంది. అద్భుత సోమనాథ్‌ను నాశనంచేసేందుకు చరిత్రలో పలుమార్లు విదేశీ పాలకులు, చొరబాటుదారులు ఎంతగానో ప్రయత్నించారు. పునర్‌నిర్మించినా మళ్లీ కూల్చేశారు. అయినాసరే ఆలయం పునర్‌నిర్మితమైంది. ఇది నిరంతరంగా కొనసాగింది. ఆలయాన్ని నాశనంచేసినట్లే దేశాన్ని సైతం కొన్ని శక్తులు బుజ్జగింపు రాజకీయాలతో భ్రష్టుపట్టించాయి. అలాంటి ఆలోచన ధోరణితోనే కొన్ని శక్తులు అయోధ్య రామమందిర నిర్మాణాన్ని అడ్డుకోవాలనిచూశాయి. జాతి ప్రతిష్ఠ, గుర్తింపునకు సంబంధించిన ఇలాంటి అంశాల్లోకి ఒక్కోసారి రాజకీయాలు చొరబడుతుంటాయి''అని అన్నారు.

నెహ్రూ వద్దన్నా పటేల్ పట్టుబట్టారు

''ఆలయ నిర్మాణంపై నెహ్రూ అభ్యంతరాలు వ్యక్తంచేశారు. అయినాసరే ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్, తొలి రాష్ట్రపతి డాక్టర్‌రాజేంద్ర ప్రసాద్ ఆధునిక సాంస్కృతిక సౌధం సోమనాథ్ పునర్‌నిర్మాణానికి పట్టుబట్టి సాధించారు. అయోధ్యలో భవ్యమందిర నిర్మాణానికి పూనుకున్నప్పుడూ ఇలాంటి శక్తులు అడ్డుతగిలాయి. అయినాసరే మనం అభివృద్ధి, వారసత్వ పరంపరను ముందుకు తీసుకెళ్లాల్సిందే. గతంలో ఇలాంటి సాంస్కృతిక కేంద్రాలను నిర్లక్ష్యంచేసిన ఫలితాలను నేటికీ అనుభవిస్తున్నాం. నేటి భారతంలో సాంస్కృతిక వారసత్వం, అభివృద్ధి అవిభాజ్యాలు. జంటగా పురోభివృద్ధి సాధించాల్సిందే''అని అన్నారు. ఈ సందర్భంగా మోదీ సోమనాథ్ ఆలయానికి సంబంధించిన స్మారక తపాళాబిళ్లను ఆవిష్కరించారు.

దారిపొడవునా జనసందోహం

అంతకుముందు జామ్‌నగర్ నుంచి గిర్ సోమనాథ్ జిల్లాకు మోదీ హెలికాప్టర్‌లో చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి వీర్ హమీర్జీ కూడలి దాకా కిలోమీటర్ దూరానికిపైగా పొడవున మార్గంలో మోదీ రోడ్‌షోలో పాల్గొన్నారు. దారి పొడవునా సోమనాథ్ వాసులు మోదీకి పూలవర్షం కురిపిస్తూ ఆహ్వానం పలికారు. జెండాలు చేతబట్టుకుని మోదీకి అనుకూలంగా నినాదాలుచేశారు. మార్గమధ్యంలో పలు చోట్ల పశ్చిమబెంగాల్ నుంచి వచ్చిన సంప్రదాయ కళాకారులు సంప్రదాయ నృత్యాలుచేసి స్థానికులను అలరించారు. సోమనాథ్ అనేది దేశంలోని 12 జ్యోతిర్లింగాల్లో ఒకటిగా ప్రఖ్యాతిగాంచింది.

ఆలయంలో మోదీ ప్రత్యేక పూజ

అంతకుముందు మోదీ సోమనాథ్ పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోకి రాగానే పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ నరేంద్ర మోదీ గర్భగుడిలో సోమలింగానికి జలాభిషేకం చేశారు. తర్వాత మహాపూజ క్రతువును పూర్తిచేశారు. ఇదే సందర్భంలో దేశంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రాల నుంచి తెప్పించిన పవిత్ర జలాలతో పండితులు ఆలయ శిఖరంపై ఉన్న కలశాలకు మహాభిషేకంచేశారు.

ఈ సందర్భంగా హెలికాప్టర్లు గులాబీ పూరేకులతో ఆలయంపై పూలవాన కురిపించారు. ధ్వజపూజ సైతం చేశారు. తర్వాత అక్కడి సందర్శకుల పుస్తకంలో రాశారు. ఓంకార మంత్ర జపించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి పండితులు చెప్పిన సోమనాథ్ అనుబంధ గాథలను మోదీ సైతం విన్నారు. తర్వాత భారతవాయుసేనకు చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం ఒళ్లు జలదరించేలా చేసిన వైమానిక విన్యాసాలను మోదీ తిలకించారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భుపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సింఘ్వీ సైతం పాల్గొన్నారు.

ఒడిస్సా టూ మహారాష్ట్ర.. వయా ఓఆర్ఆర్

- అంతరాష్ట్ర గంజాయి సరఫరా ముఠా అరెస్టు
- 400 కిలోల గంజాయి స్వాధీనం

ఈకబురు, శేరిలింగంపల్లి : ఒడిస్సా రాష్ట్రంలోని మల్కాన్ గిరి నుంచి మహారాష్ట్రకు గంజాయిని సరఫరా చేస్తున్న అంతరాష్ట్ర గంజాయి సరఫరా ముఠా ఔటర్ రింగురోడ్డు మీదుగా ప్రయాణిస్తూ సైబరాబాద్ పోలీసులకు చిక్కారు. ఈ ముఠాలోని మొత్తం 7గురిని అరెస్టు చేసిన సైబరాబాద్ ఎస్ఓటీ, పటాన్ చెరు పోలీసులు దాదాపు 2కోట్ల రూపాయల విలువైన 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సినీ ఫక్కీలో డీసీఎం లారీలో గంజాయిని తరలిస్తూ, ముందు ఓ కారును ఎస్కార్టుగా పెట్టిన నిందితులు ఔటర్ మీద పోలీసులకు చిక్కారు. పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు సోమవారం శేరిలింగంపల్లి జోన్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిసిపి శ్రీనివాస్ వెల్లడించారు..

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డిసిపి శ్రీనివాస్ తదితరులు

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనాలు

మహారాష్ట్ర పరిధిలోని సోలాపూర్ కు చెందిన మనీషా వద్వాల్ సులభంగా డబ్బు సంపాదించడం కోసం సోలాపూర్ పరిధిలో పలు చట్టవిరుద్ధ వ్యాపారాలు చేసింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ సంపాదించాలనే దుర్బుద్ధితో గంజాయి విక్రయించాలని పథకం వేసింది. ఓడిస్సా రాష్ట్రం మల్కానిగిరిలో గంజాయి సరఫరా చేసే ట్రైబూన్ వద్ద గంజాయి కొనుగోలు చేయాలని నిర్ణయించి మధ్యవర్తి అయిన సోలాపూర్ సంగోలాకు చెందిన ప్రతాప్ హరిదాస్ పవార్(24) ను సంప్రదించింది. ఈమేరకు ప్రతాప్ పరివార్ తో ఓడిస్సా నుంచి మహారాష్ట్రకు గంజాయిని సరఫరా చేసేందుకు ఒప్పందం చేసుకుంది. దీంతో గంజాయి వ్యాపారి ట్రైబూన్ ను సంప్రదించి సోలాపూర్ కు చెందిన డీసీఎం లారీ యజమాని ఆనంద్ మయాప్ప హోవల్ (34)తో కలిసి గంజాయి రవాణా చేయాలని నిర్ణయించాడు. వీరు డీసీఎం నడిపేందుకు సోలాపూర్ కు చెందిన డ్రైవర్లు చండనివ్ అడుంబర్(46), రంజిత్ రాజేందర్ గడిగె(27), మారుతి ఎర్టిగా కారు యజమాని బాలాజీ గణేష్ హన్మణి(35), రోహిత్ హోవల్ (27), చందశివ్ సాహిల్(17)లతో కలిసి ఓ ముఠాగా ఏర్పడ్డారు. ఈనెల 8వ తేదీన వీరంతా ఓడిస్సాకు వెళ్లి ట్రైబూన్ ను కలిసి 400 కిలోల గంజాయిని డీసీఎం లారీలో లోడ్ చేసుకొని మహారాష్ట్రకు బయలుదేరారు. డ్రైవర్లు చందన్ శివ్ అడుంబర్, రంజిత్ రాజేందర్లతో పాటు యజమాని ఆనంద్ మయప్పలు డీసీఎంలో బయలుదేరారు. 2కిలోలకు ఒక ప్యాకెట్ చొప్పున ప్యాకింగ్ చేసిన 400 కిలోల గంజాయి ని డీసీఎంలో లోడ్ చేసి, వాటి మీద ఖాళీ కూరగాయల ట్రేలు అమర్చారు. ఎర్టిగా కారులో బాలాజీ గణేష్, ప్రతావ్ హరిదాస్, రోహిత్, చంద్రశివ్ లు కూర్చున్నారు, ముందు ఎర్టిగా కారు ఎస్కార్టుగా ప్రయాణిస్తూ సమాచారం అందజేస్తుండగా, వెనుక డీసీఎం ప్రయాణించింది. మహారాష్ట్రకు వెళ్లే క్రమంలో నగరంలోని ఔటర్ రింగురోడ్డు మీదుగా ప్రమాణం సాగించేందుకు ఔటర్ ను ఎక్కారు. కాగా విశ్వసనీయ సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి జోన్ ఎస్ ఓ టీ, పటాన్చెరు పోలీసులు ఔటర్ మీద ఈ ముఠాను పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 2కోట్ల రూపాయల విలువైన 400 కిలోల గంజాయి, డీసీఎం లారీ, కారు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మణిషా వద్వాల్, ట్రైబూన్ లు పరారీలో ఉన్నారు.

బండి భగీరథ్ మీద చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మహిళా విభాగం డిమాండ్

సైబరాబాద్ కమీషనరేట్ ముందు నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ మహిళా విభాగం

మీడియాతో మాట్లాడుతున్న కొమిరిశెట్టి సాయిబాబా

సైబరాబాద్ కమీషనర్ కు వినతి

ఈకబురు, శేరిలింగంపల్లి : మైనర్ బాలిక మీద ఆఘాయిత్యం, పోక్సో కేసు నమోదైన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ మీద వెంటనే చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మహిళా విభాగం డిమాండ్ చేసింది. ఈ మేరకు బిఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు సోమవారం సైబరాబాద్ కమీషనర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమీషనరేట్ ముందు బిఆర్ఎస్ నాయకురాలు తుల ఉమా మాట్లాడుతూ తమ బిడ్డకు అన్యాయం జరిగిందని బాధితురాలి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసి 48 గంటలు గడుస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలని, బాధితురాలికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ వెంటనే తన కుమారుడు చేసిన పనికి నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిస్పక్షపాత విచారణ చేపట్టాలని, ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ తనకు అన్యాయం జరిగిందని ఓ బాధితురాలు రోజుల తరబడి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా పోలీసులు కేసు నమోదు చేయకుండా తాత్సారం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి ఒత్తిడికి తలొగ్గి బాధితురాలికి న్యాయం చేయకుండా వేదించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేస్తుందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయడంతో పాటు బాధితురాలికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కమీషనర్ కు వినతిపత్రం సమర్పించిన వారిలో బిఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాళ్లు, సీనియర్ నాయకులు ఉన్నారు.

ఉత్తమ పాలసీలతోనే.. ఏపీకి పెట్టుబడులు

పారిశ్రామిక రంగానికి అనుకూలమైన రాష్ట్రంగా ఏపీలో ఎంఎస్ఎంఈలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానాన్ని అమలు చేస్తున్నట్టు వివరించారు. ఏపీ ప్రజలు కూడా పరిశ్రమలు ఏర్పాటు చేయటంలో ఎప్పుడూ ముందు ఉంటారని అందుకే వారికి ఆంధ్రాప్రెన్యూర్స్ అనే పేరు వచ్చిందని అన్నారు. సీఐఐ సంస్థ అమరావతిలో గ్లోబల్ లీడర్షిప్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు రావటం సంతోషదాయకమన్నారు. ఏపీలో క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ , డ్రోన్స్ ఏరోస్పేస్, డిఫెన్స్ తదితర రంగాల పరిశ్రమల్ని పెట్టుబడుల్ని ఆకర్షించేలా వివిధ పాలసీలను అమలులోకి తెచ్చామని.. ఏపీలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం అని సీఎం పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.

ప్రధాని మిషన్ ను ముందుకు తీసుకెళ్లాం

దేశంలో అమలు చేసిన ఆర్థిక సంస్కరణలు మనకు అవకాశాలు తెచ్చిపెట్టాయని సీఎం వ్యాఖ్యానించారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాలే తన అజెండా అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వివిధ రంగాల్లోని గ్లోబల్ ట్యాలెంట్ దేశ లక్ష్యాలు సాధించటంలో కీలకంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ సుస్థిరమైన ప్రభుత్వాలు ఉన్నాయని ఆయన అన్నారు. పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో మంచి ఫలితాలు వచ్చాయని.. గతంలో ఆ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా ఉండేదని గత కొంతకాలంగా ఆ రాష్ట్రానికి అభివృద్ధి ఆలోచనలే లేకుండా పోయాయన్నారు. సంస్కరణల వాది అయిన ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుందన్నారు. 8 అంశాలతో కూడిన నేషనల్ మిషన్ ను ప్రధాని మోదీ ప్రకటించారని దానిని అనుసరించి ముందుకు వెళ్దామని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. బంగారం కొనుగోలును వాయిదా వేయటం, ఇంధనాన్ని పొదుపు చేయటం, ప్రతీ ఇల్లు, పరిశ్రమ, పొలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలుగా మార్చటం, ప్రజా రవాణా వినియోగం లాంటి అంశాలను పాటించి వనరుల్ని సద్వినియోగం చేద్దామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. యుద్ధానంతర పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు చూశామని ఇలాంటి వాటిని సమర్థంగా ఎదుర్కోవాల్సి ఉందన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అన్న నినాదాన్ని కూడా ప్రధాని ఇచ్చారని దానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు మనకు ఉన్నాయన్నారు. స్వయం సమృద్ధి అనే అంశాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారని ప్రకృతి సేద్యం ద్వారా ఎరువుల దిగుమతి తగ్గిద్దామని అన్నారు. ఏపీలో 20 లక్షల ఎకరాలు ప్రకృతి సేద్యంలో ఉన్నాయని తద్వారా భూసారం పెంచటంతో పాటు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీని సాధించేలా ప్రయత్నాలు చేస్తున్నామన అన్నారు. ఈ జాతీయ టాస్క్ ను మనం అంతా కలిసి సాధించాలన్నారు. ప్రతీ సవాలూ ఓ అవకాశాన్ని సృష్టిస్తుందని భారత్ ఇక అన్ స్టాపబుల్ అని.. గ్లోబల్ జెయింట్ గా ఇండియా మారుతుందన్నారు. గ్రీన్ ఎనర్జీ బయో గ్యాస్, ఇథనాల్, ఈవీ, వికేంద్రీకృత ఇంధన వ్యవస్థలు ఇప్పుడు మనకు కావాలని అన్నారు. ఏపీలో ప్రోజ్యూమర్ అనే విధానాన్ని ఇప్పటికే పాటిస్తున్నామని.. సోలార్ రూఫ్ టాప్ ద్వారా దీనిని సాధించనున్నట్టు వివరించారు. మైక్రో గ్రిడ్ వ్యవస్థ ద్వారా ట్రాన్స్ మిషన్ నష్టాలను కూడా ఎదుర్కోనేలా ఏపీ సిద్ధమవుతోందన్నారు.

ఉమ్మడిగా సాధిద్దాం

భవిష్యత్ పారిశ్రామిక అవసరాల కోసం విద్య సంస్థలు, ప్రభుత్వం, పారిశ్రామిక రంగం కలిసి ఉమ్మడిగా కృషి చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరుల్ని, ఆవిష్కరణల్ని విద్యా సంస్థలు తయారు చేయాల్సి ఉందని, ప్రభుత్వాలు పెట్టుబడులు తీసుకువస్తాయని ఈ మూడు కలిసి పనిచేస్తేనే ఫలితాలు వస్తాయని ముఖ్యమంత్రి విశ్లేషించారు. గ్లోబల్ టెక్ రంగంలో భారత్ లీడర్ గా మారాలంటే అంతా కలిసి పనిచేయాల్సి ఉందని పిలుపునిచ్చారు. పట్టభద్రులను నిపుణులుగా మార్చుకోడానికి పరిశ్రమలకు నెలల సమయం వృధా చేస్తే లక్ష్యాన్ని సాధించలేమని ఆయన వ్యాఖ్యానించారు. ఎంప్లాయబిలిటీని జాతీయ మిషన్ గా మార్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పరిశోధన, స్కిల్లింగ్, స్టార్టప్ , మాన్యుఫాక్చరింగ్, గవర్నెన్స్, ఇన్నోవేషన్ లాంటి సమీకృత విధానాలపైనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉందని స్పష్టం చేశారు. 2047 నాటికి ఏపీ 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తయారు కావాలని ప్రణాళికలు చేసుకున్నామని అన్నారు. భారత 500 గిగావాట్ల ఇంధన ఉత్పత్తి లక్ష్యంలో ఏపీ 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్టు వివరించారు. సంస్కరణల వల్లే విశాఖకు దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి వచ్చింది.. గూగుల్ తో పాటు రిలయన్స్ కూడా ఏపీలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందన్నారు. ఏపీలో మొదటి సారి విద్యుత్ కొనుగోళ్ల వ్యయాన్ని 30 పైసలకు తగ్గించామని త్వరలోనే దీనిని రూ.1.30 కి తగ్గించేలా లక్ష్యం పెట్టుకున్నామని అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు విధానాలతో ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. టెక్నాలజీ ఇంటిగ్రేటెడ్ నగరంగా ఏపీ రాజధాని అమరావతిని నిర్మిస్తున్నట్టు సీఎం వివరించారు. సమాజానికి తిరిగి ఇవ్వడంతో పాటు పేదల జీవన ప్రమాణాలు పెంచేలా ఏపీలో పీ4 కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఏజింగ్ సమస్యకు చెక్ పెట్టేలా పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ తీసుకువచ్చామన్నారు. సంపద వస్తేనే సంక్షేమం అని.. ప్రభుత్వానికి ఆదాయం లేకుండా ఏ రాజకీయనాయకుడూ సంక్షేమ పథకాలు ప్రకటించలేరన్నారు.

బంగ్లాదేశ్‌తో సరిహద్దుల్లో కంచె

..బీఎస్ఎఫ్‌కు భూమి కేటాయింపు

పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటైన నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తొలి మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి బీఎస్ఎఫ్‌కు భూమిని బదిలీ చేశామన్నారు. మరో 45రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకంతో పాటు ఇతర పథకాలనూ రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లుగా.. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని సువేందు పేర్కొన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్‌ను గత ప్రభుత్వం విస్మరించిందని..దానిని తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు.

టీఆర్ఎస్ జెండా పండుగ

ఈకబురు,,హైదరాబాద్ :

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు ఈనెల 20 నుంచి జూన్ 20 వరకు నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'జెండా పండుగ' నిర్వహించాలని పార్టీ శ్రేణులకు అధ్యక్షులు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాల నుంచి మొదలుకొని మండల, గ్రామ స్థాయి వరకు ప్రతి వార్డులో పార్టీ జెండాలు ఎగురవేసి, పార్టీ ప్రకటించిన పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ మళ్లీ వంచనకు గురవుతోందని, వలస పాలన నాటి దుష్పరిణామాలను నేడు మళ్లీ ఎదుర్కొంటున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తెలంగాణ పునర్నిర్మాణం కోసం తెలంగాణ రక్షణ సేన బాధ్యత తీసుకొని ఉద్యమిస్తుందని తెలిపారు.

తెలంగాణ పునర్నిర్మాణం కోసం ఉద్యమిద్దాం

తెలంగాణ ఏర్పడి పన్నెండున్నరేళ్లు గడిచిన సరే ఇంకా వలస పాలన నాటి దుష్పరిణామాలే ఇప్పటికీ కనిపిస్తున్నాయని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ తెచ్చుకుంటే బతుకులు మారుతాయని అనుకున్న ప్రతివర్గం కూడా ఇప్పుడు తీవ్ర నిస్పృహలో ఉందని విచారం వ్యక్తం చేశారు. స్వరాష్ట్ర సాధనకు అవిశ్రాంతంగా ఉద్యమించిన మనమంతా కూడా ఇప్పుడు తెలంగాణ పునర్నిర్మాణం, సబ్బండ వర్గాల వికాసం కోసం మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ రక్షణ సేన జెండాను ప్రతి వాడకు, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ ఆవిర్భావానికి మూడు నెలల ముందు నుంచే పెద్ద ఎత్తున చేరిన నాయకత్వంతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు సమన్వయంతో జెండా పండుగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గుప్తనిధుల కోసమే శివాలయం కూల్చివేత

ఈకబురు, హైదరాబాద్ :

వరంగల్‌లో కాకతీయుల నాటి చారిత్రక శివాలయం కూల్చివేత ఘటనపై మాజీ మంత్రి.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బడులకు.. గుడులకు దిక్కులేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భగవంతుడంటే భక్తి.. భయం లేవని.. దేవుళ్లపై ఒట్టేసి రుణమాఫీ చేస్తానని చెప్పి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో దేవాలయాలను అభివృద్ధి చేస్తే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని కూలగొడుతోందని ఆయన ధ్వజమెత్తారు. కాకతీయ గణపతి దేవుడు నిర్మించిన అద్భుతమైన శివాలయాన్ని గుప్తనిధుల కోసమే ఉద్దేశపూర్వకంగా అర్ధరాత్రి వేళ కూల్చేశారని హరీశ్ రావు ఆరోపించారు. రేవంత్ రెడ్డికి కూల్చడం కొత్తేమీ కాదని.. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను.. బతుకులను ఇప్పటికే కూల్చేశారని విమర్శించారు. నిజాం కట్టడాల చుట్టూ లంకెబిందెలు ఉన్నాయని గతంలోనే వెలికించారని.. ఇప్పుడు కాకతీయులు ఏలిన ఓరుగల్లుపై పడ్డారని ఆయన పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి కనుసన్నల్లోనే ఈ తవ్వకాలు జరిగాయని ఆయన బాంబు పేల్చారు. గర్భగుడి కింద ఏకంగా 24 అడుగుల కందకం తవ్వారంటే అది గుప్తనిధుల కోసం కాక మరేమిటని హరీశ్ రావు ప్రశ్నించారు. ఆ తవ్వకాల్లో ఏం దొరికాయో.. ఏం ఎత్తుకెళ్లారో ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో శివాలయం భూమిని దేవాదాయ శాఖ భూమిగా నమోదు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 'భూభారతి'లో దానిని ప్రభుత్వ భూమిగా ఎందుకు మార్చారో చెప్పాలన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మరో చోటు నుండి ఇక్కడికి మార్చడం వెనుక ఉన్న మర్మమేంటని నిలదీశారు. లంకెబిందెల వేటలో భాగంగానే ఆలయాన్ని కూల్చారని ఆయన స్పష్టం చేశారు. అధికారులు ఈ వ్యవహారంలో బుకాయిస్తున్నారని..

పురావస్తు శాఖ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. తవ్వకాలకు వాడిన మెషినరీని సీజ్ చేయాలని.. యుద్ధప్రాతిపదికన దేవాలయాన్ని పునరుద్ధరించాలని కోరారు. దేవాలయ స్థలాన్ని తక్షణమే పురావస్తు శాఖకు అప్పగించి.. బయటపడ్డ లంకెబిందెలు.. గుప్తనిధులపై సమగ్ర విచారణ జరపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చారిత్రక సంపదను కాపాడాల్సిన ప్రభుత్వమే ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమన్నారు.

హైదరాబాద్ లో ప్రధాని మోడీ పై కాంగ్రెస్ నేత విహెచ్ ఫిర్యాదు

ఈకబురు,హైదరాబాద్ :

అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ రాష్ట్ర బీసీ సలహా దారు వి హనుమంతరావు ప్రధాని నరేంద్ర మోడీ పై ఫిర్యాదు చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సభలో ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఈ ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీని "ముస్లింల పార్టీ"గా పేర్కొంటూ చేసిన వ్యాఖ్యలు సామాజిక విభేదాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని వి. హనుమంతరావు ఆరోపించారు.ఈ సందర్భంగా అంబర్‌పేట్ ఎస్ హెచ్ ఓ కిరణ్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు లేఖను అందజేశారు. ప్రధాని చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ఎవరు మాట్లాడినా వారిపై చర్యలు తప్పనిసరిగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా ఈ అంశంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందన్నారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు తగిన విధంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్ గొర్నాక కంటెస్టెడ్ కార్పొరేటర్ పోలినేని రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు

సునీల్ మిట్టల్‌కు సీసీఐ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం

భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ సునీల్ భారతీ మిట్టల్‌కు ప్రతిష్టాత్మకమైన 'సీఐఐ ప్రెసిడెంట్స్ అవార్డ్ ఫర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' పురస్కారం లభించింది. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. భారత ఆర్థిక పురోగతికి మరియు పారిశ్రామిక రంగానికి సునీల్ మిట్టల్ అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు.ఈ సందర్భంగా సునీల్ మిట్టల్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. 2007లో తాను సీఐఐ అధ్యక్షుడిగా పనిచేసిన కాలాన్ని గుర్తు చేసుకుంటూ, దేశ ఆర్థిక వ్యవస్థలో సీఐఐ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. భారతీయ పరిశ్రమలు విదేశీ దిగుమతులపై (ముఖ్యంగా బంగారం) ఆధారపడటం తగ్గించి, స్వదేశీ పెట్టుబడులు, తయారీ (Make in India) పై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు (ముఖ్యంగా మధ్యప్రాచ్యం) ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెస్తున్నాయని, ఇలాంటి సమయంలో ప్రధాని మోదీ ఇచ్చిన సందేశాన్ని పరిశ్రమలు పాటించాలని కోరారు. బంగారం దిగుమతులపై వ్యామోహం తగ్గించుకోవాలన్నారు. పునరుత్పాదక ఇంధనం వైపు మళ్లడం, నూతన ఆవిష్కరణల ద్వారా దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పారిశ్రామికవేత్తలను కోరారు. ఎయిర్‌టెల్ సంస్థ గడిచిన ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 31,000 కోట్ల భారీ పెట్టుబడులను (CapEx) వెచ్చించినట్లు ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

రూ.10వేల కంటే తక్కువ ధర సరికొత్త స్మార్ట్ ఫోన్!

స్టైలిష్ అండ్ ఇన్నోవేటివ్ స్మార్ట్‌ఫోన్‌లకు ప్రసిద్ధి చెందిన 'జెనో సిరీస్' ఇప్పుడు తన కొత్త స్మార్ట్‌ఫోన్ జెనో 200ను లాంచ్ చేసింది. ఇది అమెజాన్ ఈకామర్స్ వెబ్‌సైట్‌లో అమ్మకానికి ఉంది. దీని ధర కేవలం రూ.9,999 మాత్రమే.

ఈ ఫోన్‌లో MILSTD810H మిలిటరీ గ్రేడ్ డ్యూరబిలిటీ ఉంది. కాబట్టి సాధారణ బడ్జెట్ ఫోన్‌లతో పోలిస్తే ఇది చాలా దృఢంగా ఉంటుంది. ఇది IP65 రేటింగ్ ఉండటంతో ధూళి, నీటి నుంచి కూడా రక్షణ లభిస్తుంది. ఇందులో AI అసిస్టెంట్ కూడా ఉండటం వల్ల.. ఇది రోజువారీ పనులను మరింత సులభంగా.. వేగంగా చేయడంలో సహాయపడుతుంది. ఈ ఫోన్ 4+8GB RAM, 128GB స్టోరేజ్‌తో లభిస్తుంది.

జెనో 200 ఫోన్‌లో 6.75 ఇంచెస్ 120Hz HD+ డిస్ప్లే ఉంది. DTS సౌండ్ సపోర్ట్ వల్ల వీడియోలు, మ్యూజిక్ మరింత అద్భుతమైన అనుభవాన్ని ఇస్తాయి. ఈ ఫోన్ నాలుగేళ్లు పాటు మంచి పనితీరును అందిస్తుందని కంపెనీ వెల్లడించింది. ఫోటోగ్రఫీ కోసం 13 మెగాపిక్సెల్ రియర్ కెమెరా లభిస్తుంది. అలాగే IR Blaster ద్వారా TV, AC వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా కంట్రోల్ చేయవచ్చు.

ఆక్టా కోర్ యూనిసోక్ టీ7250 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 15 గో వంటివి జెనో 200 ఫోన్‌లో ఉండటం వల్ల, ఇది గేమింగ్, మల్టీటాస్కింగ్, వీడియో కాలింగ్‌లో మంచి అనుభవాన్ని అందిస్తుంది. ఇందులో 5000mAh బ్యాటరీ ఉంటుంది. ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్‌తో దీనిని రోజంతా సౌకర్యంగా ఉపయోగించుకోవచ్చు. ఈ ఫోన్ కామెట్ ఆరంజ్, మీటియోర్ టైటానియం, బ్లూ వంటి రంగులలో లభిస్తుంది.

రూ.10 వేలు కంటే తక్కువ ధరలో స్మార్ట్‌ఫోన్‌లు

టెక్నో స్పార్క్ గో 3: ప్రారంభ ధర రూ.9,999

పోకో సి81ఎక్స్: ప్రారంభ ధర రూ.9,999

లావా బోల్డ్ N2 ప్రో: ప్రారంభ ధర రూ.7,999

టెక్నో పాప్ X: ప్రారంభ ధర రూ.9,299

ఏఐ+ పల్స్ 2: ప్రారంభ ధర రూ.8,999

సిప్ చేసేస్తున్నారు

హైదరాబాద్: భారతీయ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) ఏప్రిల్ చివరి నాటికి రూ.81.92 లక్షల కోట్లకు చేరుకుంది. పెట్టుబడిదారుల నుంచి వస్తున్న స్పందన, ముఖ్యంగా క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్), ఈక్విటీ ఫండ్ల లోకి వస్తున్న నిరంతర పెట్టుబడులు ఈ వృద్ధికి ప్రధాన కారణమని భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) వెల్లడించింది. ఈ మేరకు సోమవారం గణాంకాలను విడుదల చేసింది.

ఈ ఏడాది మార్చిలో రూ.73,73,376.98 కోట్లుగా ఉన్న ఏయూఎం ఏప్రిల్ చివరి నాటికి రూ.81,92,387.69 కోట్లకు చేరుకుంది. కేవలం ఒక నెల వ్యవధిలోనే 11.2 శాతం వృద్ధి నమోదైంది. మార్కెట్లో ఉన్న మొత్తం మదుపరుల సంఖ్య 27.53 కోట్లకు చేరింది. ఏప్రిల్‌లోనే కొత్తగా 13.77 లక్షల ఖాతాలు జతయ్యాయి. ఇందులో కేవలం రిటెయిల్ పెట్టుబడిదారుల (ఈక్విటీ, హైబ్రిడ్, సొల్యూషన్ ఓరియంటెడ్ పథకాలు) ఖాతాల సంఖ్యే 21 కోట్లకు పైగా ఉంది. వీరి పెట్టుబడుల విలువ రూ.47,41,872 కోట్లుగా ఉన్నాయి.

ఈక్విటీ ఫండ్లపై మదుపరుల ఆసక్తి స్థిరంగా కొనసాగుతూనే ఉంది. ఈక్విటీ ఫండ్లలోకి మార్చి 2021 నుంచి సానుకూల పెట్టుబడులు వరుసగా 62వ నెలకు చేరుకున్నాయని యాంఫీ వెల్లడించింది. ఏప్రిల్‌లో ఈక్విటీ విభాగంలోకి రూ.38,440.20 కోట్ల మేరకు నికర పెట్టుబడులు వచ్చాయి. ఈ విభాగంలో ఫ్లెక్సీ క్యాప్ రూ.10,147.85 కోట్లు, స్మాల్ క్యాప్ ఫండ్లు రూ.6,885.90 కోట్లు, మిడ్ క్యాప్ ఫండ్లు రూ.6,551.40 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

డెట్ ఫండ్లలోకి..

డెట్ ఫండ్లలోకి సైతం ఏప్రిల్‌లో రూ.2,47,490.03 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. ఇందులో అధికభాగం లిక్విడ్ ఫండ్లు సొంతం చేసుకోగా, ఆ ఒక్క విభాగంలోకే అత్యధికంగా రూ.1,65,104.67 కోట్లు వచ్చాయి. మరోవైపు హైబ్రిడ్ ఫండ్లు ద్వారా రూ.20,565.24 కోట్లు రాగా, అందులో సగానికిపైగా ఆర్బిట్రేజ్ ఫండ్ల ద్వారానే సమకూరాయి. ఇండెక్స్ ఫండ్లు, ఈటీఎఫ్‌లతో కూడిన ఇతర పథకాల విభాగంలోనూ రూ.20,082 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి.

సిప్‌లో..

గత నెలలో క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా రూ.31,115.41 కోట్ల పెట్టుబడులు మార్కెట్లోకి వచ్చాయి. సిప్ నికర ఆస్తుల విలువ రూ.16,85,126.19 కోట్లకు చేరింది. పరిశ్రమ మొత్తం ఏయూఎంలో ఇది సుమారు 20.6% నిలిచింది. మార్చిలో సిప్ పెట్టుబడులు రూ.32,087 కోట్లుగా ఉన్నాయి.

ఎస్ఐఎఫ్ ఆస్తులు ఏప్రిల్ చివరి నాటికి 16.1శాతం నెలవారీ వృద్ధితో రూ.12,329 కోట్లకు చేరుకున్నాయి. ఈ విభాగంలోకి రూ.1,218.68 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి.

మార్కెట్ లాభాలు, వివిధ ఫండ్ విభాగాల్లోకి వచ్చిన బలమైన పెట్టుబడుల కారణంగా ఫండ్ పరిశ్రమ ఏప్రిల్ నెలలో 11.2 శాతం వృద్ధి సాధించిందని యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకట్ చలసాని తెలిపారు. మ్యూచువల్ ఫండ్లలోకి సిప్ ద్వారా వస్తున్న పెట్టుబడులు.. మదుపరులకు మార్కెట్‌పై ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నందున, పెట్టుబడిదారులు తమ దీర్ఘకాలిక సంపద సృష్టి, ఆర్థిక లక్ష్యాలను సాధించే దిశగా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు.

ఇరాన్ వార్, పొదుపు చర్యల ప్రభావం.. భారీ నష్టాల్లో సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. శాంతి ఒప్పందానికి ఇరాన్ ప్రతిపాదనలను ట్రంప్ తిరస్కరించడం, చమురు ధరలు మళ్లీ పెరగడం వంటి కారణాలు ప్రపంచ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. దీనికితోడు ప్రధాని మోదీ ప్రకటించిన కొన్ని పొదుపు చర్యలు మన మార్కెట్లపై ప్రభావం చూపాయి. దీంతో సూచీలు వరుసగా మూడో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 23,850 దిగువన ముగిసింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.6 లక్షల కోట్లు క్షీణించి రూ.467 లక్షకు కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 76,638.09 (క్రితం ముగింపు 77,328.19) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,957.40 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1312.91 పాయింట్ల నష్టంతో 76,015.28 వద్ద ముగిసింది. నిఫ్టీ 360.30 పాయింట్ల నష్టంతో 23,815.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.34గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టైటాన్, ఇండిగో, ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, ఎటర్నల్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. సన్‌ఫార్మా, హిందుస్థాన్ యూనిలీవర్, అదానీ పోర్ట్స్, కోటక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4666 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవీ..

అమెరికాతో ఇరాన్ చెలగాటం ఆడుతోందని, ఇరాన్ ప్రతిపాదనలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదంటూ ఆ దేశ శాంతి ప్రతిపాదనలను ట్రంప్ తోసిపుచ్చారు. అమెరికా అసాధ్యమైన డిమాండ్లు చేస్తోందని ఆరోపిస్తూ.. అగ్రరాజ్య ప్లాన్‌ను ఇరాన్ తిరస్కరించింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు విఫలమవ్వడం, పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగతాయన్న ఆందోళనలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వాడకాన్ని తగ్గించాలని, ఏడాది పాటు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మార్కెట్‌పై ప్రభావం చూపింది. ఆర్థిక వృద్ధిని, కార్పొరేట్ ఆదాయాలను దెబ్బతీస్తుందని నిపుణులు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 105 డాలర్లకు చేరడం ప్రభావం చూపింది. దిగుమతులపై ఆధారపడే మన దేశ ఆర్థిక వ్యవస్థకు ఇది ప్రతికూల అంశం కావడం గమనార్హం.డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 95 డాలర్ల స్థాయికి పడిపోయింది. దీనికితోడు విదేశీ పెట్టుబడులు తరలిపోవడమూ ప్రభావం చూపింది.

మోదీ పొదుపు మంత్రం.. ఎకానమీకి శుభసూచకం!

పశ్చిమాసియా యుద్ధం దెబ్బతో క్రూడ్ రేట్లు భగ్గుమనడంతో మన ఆర్థిక వ్యవస్థకు బాగానే సెగ తగులుతోంది. ముడిచమురు ధరలు 100 డాలర్ల పైకి దూసుకెళ్లడంతో దిగుమతుల బిల్లు తడిసిమోపెడవుతోంది. మరోపక్క, బంగారం రేట్లు కూడా దూసుకెళ్లడంతో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు దిగుజారుతున్నాయి. దీని ప్రభావంతో రూపాయి రోజుకో కొత్త కనిష్టానికి దిగజారి నేల చూపులు చూస్తోంది. తాజాగా 95.28 ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు చేసిన సూచన దేశవ్యాప్తంగా అటు పరిశ్రమ వర్గాల్లో ఇటు ప్రజల్లో సంచనలం రేపుతోంది. ఎకానమీకి దన్నుగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం కోసం పొదుపు చర్యలు పాటించాలంటూ మోదీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు వాయిదా వేసుకోవాలని.. పెట్రోలు, డీజిల్ వాడకాన్ని తగ్గించేందుకు సాధ్యమైనంత వరకు వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలని... ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలన్నారు. అలాగే విదేశీ ప్రయా ణాలను వాయిదా వేసుకోవడం, వంటనూనెలు, ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలని కూడా పేర్కొన్నారు. ఈ చర్యలతో ఆర్థిక వ్యవస్థకు లాభంతో పాటు నష్టాలు కూడా ఉంటాయని ఆర్థిక వేత్తలు చెబుతున్నారు. దిగుమతుల భారం తగ్గడంతో కాస్త కరెంట్ ఖాతా లోటు దిగొచ్చి.. రూపాయికి దన్నుగా నిలిచినప్పటికీ, దేశీ యంగా వినిమయం తగ్గడంతో ఎకానమీ మందగించే ప్రమాదం కూడా ఉంటుందని వారు విశ్లేషిస్తున్నారు.

బంగారం గుదిబండ...

భారతీయులు సహజంగానే పసిడి ప్రియులు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు ఆభరణాల కొనుగోళ్లకు తోడు ఇటీవల పెరిగిన పుత్తడి రేట్లతో పెట్టుబడులకు కూడా మనోళ్లు సై అంటున్నారు. దీంతో బంగారం దిగుమతులు భారీగా పెరుగుతూనే ఉన్నాయి. ఏటా దేశంలోకి 700-800 టన్నుల బంగారం దిగుమతి అవుతోంది. దేశంలో ఉత్పత్తి అవుతున్నది కేవలం 1-2 టన్నులు మాత్రమే. 90% పైగా దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి. దేశ దిగుమతుల్లో ఇది దాదాపు 10% మరోపక్క, ఆపదలో ఆదుకునే సాధనంగా పసిడికి ప్రాముఖ్యత పెరగడంతో సెంట్రల్ బ్యాంకులు కూడా పోలోమంటూ గోల్డ్ నిల్వలు పెంచుకుంటున్నాయి. మన ఆర్‌బీఐ కూడా టన్నుల కొద్దీ పోగేసుకుంటోంది. ప్రస్తుతం నిల్వలు 880 టన్నులకు చేరాయి. 2005-26లో 72 బిలియన్ డాలర్లు విలువైన బంగారం దిగుమతైంది. దీనివల్ల భారీమొత్తంలో ఫారెక్స్ నిల్వలు వెచ్చించాల్సి వస్తోంది. అయితే, రేట్లు భారీగా పెరగడంతో ఇటీవల బంగారం దిగుమతులు బాగానే తగ్గుముఖం పట్టాయి. అయితే, రేటు (అంతర్జాతీయంగా ఔన్స్ ప్రస్తుతం 4700 డాలర్లు) అధిక స్థాయిలోనే కొనసాగుతుండటంతో భారీగా డాలర్లు వెచ్చించాల్సి వస్తోంది.

మోదీ చెప్పినట్లుగా బంగారం కొనుగోళ్లు తగ్గించుకుంటే, దిగుమతులు దిగొచ్చి.. ఫారెక్స్ నిల్వలకు దన్నుగా నిలుస్తుంది. దీనివల్ల రూపాయి పతనానికి కూడా అడ్డుకట్టపడుతుంది. బంగారం దిగుమతులు 30-40% తగ్గితే 20-25 బిలియన్ డాలర్లు ఆదా అవుతాయి. 50% తగ్గితే 36 బిలియన్ డాలర్లు సేవ్ అవుతాయి. అంటే ప్రజలు బంగారం కొనడం తగ్గిస్తే దేశం నుంచి బయటకు వెళ్లే డాలర్ల ప్రవాహం భారీగా తగ్గుతుంది. అయితే, దేశీయంగా కొనుగోళ్లు మందగించడం వల్ల ఆభరణాల విక్రేతలపై ప్రభావం పడుతుందని పరిశ్రమ ఆందోళన వ్యక్తం చేస్తోంది. అయితే, ఫిజికల్ గోల్డ్‌కు బదులు ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లు, ఈ-గోల్డ్ రిసీట్స్ వంటి పేపర్ గోల్డ్ రూపంలో కొనుగోలు చేయడం వల్ల అటు దిగుమతుల భారం తగ్గడంతో పాటు పెట్టుబడులకు కూడా కొలిసొచ్చే అంశమని నిపుణులు సూచిస్తున్నారు.

ఇరాన్ యుద్ధం మొదలైన తర్వాత ఒక్కసారిగా క్రూడ్ ధరలు భగ్గుమనడం తెలిసిందే. బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ రేటు 119 డాలర్లకు దూసుకెళ్లింది. రెండు నెలలుగా సగటున 100 డాలర్ల పైనే కదలాడుతోంది. దీంతో క్రూడ్ దిగుమతుల భారం భారీగా పెరిగిపోతోంది. భారత్ చమురు అవసరాల్లో దాదాపు 90 శాతం మేర దిగుమతి చేసుకోవాల్సి రావడం.. హార్మూజ్ జలసంధిలో అడ్డంకులతో సరఫరా తగ్గడంతో రేట్లు పైపైకి చేరి దిగుమతులు గుదిబండగా మారుతున్నాయి. 2025-26లో మనం 134.7 బిలియన్ డాలర్ల విలువైన క్రూడాయిల్ దిగుమతి చేసుకోవడం గమనార్హం. మన మొత్తం దిగుమతులు 775 బిలియన్ డాలర్లు కాగా, ఇందులో అత్యధిక వాటా క్రూడ్‌దే. అయితే, ప్రభుత్వం మాత్రం పెట్రోలు, డీజిల్ ధరలు పెంచకుండా ప్రజలపై భారం పడకుండా చూస్తోంది. మరోపక్క, ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించుకుని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల (ఓఎంసీలు) కు కొంచెం ఊరటనిచ్చింది. దీనివల్ల కేంద్ర ఖాజానాకు నెలకు రూ.14,000 కోట్ల చిల్లు పడుతోంది.

ఇక రేట్లు పెంచకపోవడం వల్ల ఓఎంసీలు రోజుకు సుమారు రూ.1,700 కోట్ల ఆదాయాన్ని నష్టపోతున్నట్లు అంచనా. అంటే గత పది వారాల్లో వాటిపై ఏకంగా రూ. లక్ష కోట్లకు పైగానే భారం పడినట్లు లెక్క. ఈ నేపథ్యంలోనే మోదీ పెట్రోలు, డీజిల్ వినియోగాన్ని తగ్గించుకోవడం కోసం ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించుకోవాలని, కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం కల్పించాలని, కార్ పూలింగ్‌తో పాటు, మెట్రో రైళ్లు ఇతరత్రా ప్రభుత్వ రవాణా సదుపాయాలను వాడాలంటూ సూచించారు. దీనివల్ల అటు క్రూడ్ దిగుమతులకు కాస్త అడ్డుకట్టపడి.. ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి తగ్గుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. మోదీ పెట్రో పొదుపు మంత్రంతో సోమవారం ఎలక్ట్రిక్ వాహన కంపెనీ షేర్లు రివ్వుమనడం విశేషం. కాగా, క్రూడ్ ధరలు ఇప్పట్లో శాంతించే అవకాశాలు కనిపించకపోవడం.. మోదీ తాజా సూచనలు చూస్తుంటే, సమీప భవిష్యత్తులో పెట్రో ధరలు పెరిగే అవకాశం కూడా లేకపోలేదనేది కొంత మంది పరిశీలకుల మాట!

ట్రావెల్ రంగంపై ప్రభావం..

విదేశీ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలంటూ మోదీ సూచించడం కూడా ఫారెక్స్ నిల్వలు కరిగిపోకుండా చూసుకోవడం కోసమే.. ఎందుకంటే, విదేశాలకు వెళ్లాలంటే డాలర్లను కొనుగోలు చేయాల్సి వస్తుంది. హోటళ్లను బుక్ చేసుకోవాలన్నా డాలర్లు వెచ్చించాల్సిందే. 2025లో 3.27 కోట్ల మంది భారతీయులు విదేశీ ప్రయాణాలకు వెళ్లినట్లు అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మనోళ్లు విదేశీ ట్రిప్పుల కోసం వెచ్చించిన మొత్తం 31.7 బిలియన్ డాలర్లు. అంటే ఆ మేరకు దేశం నుంచి డాలర్లు బయటికి వెళ్లిపోయాయి. మోదీ సూచన పాటిస్తే, ఈ భారం తగ్గుతుంది. అయితే, విదేశీ ప్రయాణాలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్ తగ్గడంతో ట్రావెల్, ఏవియేషన్ కంపెనీలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. మార్కెట్లో ఇప్పటికే దీని సెగ తగిలింది. యాత్రా, థామస్ కుక్ వంటి ట్రావెల్ సంస్థల షేర్లతో పాటు ఇండిగో షేరు కూడా 5 శాతం పైగా పడిపోయాయి.

ఫారెక్స్ నిల్వలు తగ్గుముఖం... క్యాడ్ పైపైకి

పశ్చిమాసియా యుద్ధం ప్రారంభానికి ముందు అంటే ఫిబ్రవరి చివరల్లో భారత విదేశీ మారక నిల్వలు 728.5 బిలియన్ డాలర్లకు చేరి ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేశాయి. క్రూడ్ ధరలు భగ్గుమనడం.. దిగుమతుల బిల్లు పెరిగిపోవడంతో ఆ తర్వాత నుంచి తగ్గుముఖం పడుతూ ప్రస్తుతం సుమారు 690.69 బిలియన్ డాలర్లకు చేరాయి. మరోవైపు ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం 2026లో భారత కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్-దేశంలోకి వచ్చి,పోయే విదేశీ మారక ద్రవ్యం (ప్రధానంగా డాలర్లు) మధ్య వ్యత్యాసం) 84.5 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేసింది. ఇది మన జీడీపీలో 2 శాతానికి సమానం. అంటే దేశంలోకి వచ్చే డాలర్ల కంటే బయటికి వెళ్లే మొత్తం భారీగా పెరిగిపోతుందన్నమాట! దీనివల్ల రూపాయి మరింత క్షీణించే అవకాశం ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

56 దేశాల్లో భారతీయులకు బంపర్ ఆఫర్!

వేసవి విడిదికి తోడు ఈద్ సెలవులు దగ్గరపడుతుండటంతో అంతర్జాతీయ పర్యాటకానికి భారతీయులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో భారత పాస్‌పోర్ట్ శక్తిసామర్థ్యాలపై తాజా 'హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్' ఆసక్తికర గణాంకాలను విడుదల చేసింది. ప్రస్తుతం గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో భారత్ 78వ స్థానంలో నిలిచింది. ఫిబ్రవరిలో ఉన్న 75వ స్థానం నుంచి స్వల్పంగా పడిపోయినప్పటికీ, భారతీయులు వీసా ముందస్తు దరఖాస్తు అవసరం లేకుండానే ప్రపంచ వ్యాప్తంగా 56 దేశాలను చుట్టిరావచ్చు.

ర్యాంకింగ్‌లో హెచ్చుతగ్గులు..

గ్లోబల్ వీసా విధానాల్లో వస్తున్న మార్పుల వల్ల భారత్ ఈసారి క్యూబా, సెనెగల్ వంటి దేశాలతో కలిసి 78వ స్థానాన్ని పంచుకుంది. అయితే, గమ్యస్థానాల పరంగా చూస్తే భారత్ బలం స్థిరంగానే ఉంది. 2025లో 57 దేశాలకు వీసా లేకుండా ప్రవేశం ఉండేది. అది జనవరి 2026 నాటికి 55 దేశాలకు తగ్గింది. ప్రస్తుతం గాంబియా చేరికతో 56 దేశాలకు వీసాఫ్రీ యాక్సిస్ పెరిగింది.

ఎక్కడికి ఎలా వెళ్లొచ్చు?

భారత పౌరులకు ప్రస్తుతం 30 దేశాలు పూర్తిస్థాయిలో వీసా రహిత ప్రవేశాన్ని కల్పిస్తుండగా, 23 దేశాలు 'వీసాఆన్‌అరైవల్' (వచ్చిన తర్వాత వీసా), మరో 3 దేశాలు 'ఈటీఏ' (ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్) పద్ధతిలో అనుమతిస్తున్నాయి.

వీసా రహిత ప్రవేశం ఉన్న దేశాల్లో అంగోలా, బార్బడోస్, భూటాన్, బ్రిటిష్ వర్జిన్ దీవులు, కుక్ దీవులు, డొమినికా, ఫిజీ, గ్రెనడా, హైతీ, జమైకా, కజకస్తాన్, కిరిబాటి, మకావో (ఎస్.ఎ.ఆర్ చైనా), మలేషియా, మారిషస్, మైక్రోనేషియా, మోంట్సెరాట్, నేపాల్, నియు, ఫిలిప్పీన్స్, రువాండా, సెనెగల్, సెయింట్ విన్సెంట్ అండ్ ది గ్రెనడైన్స్, థాయ్‌లాండ్, ది గాంబియా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, వనాటు ఉన్నాయి.వీసాఆన్‌అరైవల్ (VOA) అనుమతిస్తున్న దేశాల్లో బురుండి, కంబోడియా, కేప్ వెర్డే దీవులు, కొమొరో దీవులు, జిబౌటి, ఇథియోపియా, గినియాబిస్సావు, ఇండోనేషియా, జోర్డాన్, లావోస్, మడగాస్కర్, మాల్దీవులు, మార్షల్ దీవులు, మంగోలియా, మొజాంబిక్, మయన్మార్, పలావు దీవులు, ఖతార్, సియెర్రా లియోన్, శ్రీలంక, సెయింట్ లూసియా, టాంజానియా, తైమూర్‌లెస్టే, తువాలు, జింబాబ్వే ఉన్నాయి.ఇక కెన్యా, సీషెల్స్, సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ దేశాలు ఈటీఏ విధానంలో ప్రవేశం కల్పిస్తున్నాయి.

పర్యాటకుల చూపు.. 'సమీప' దేశాల వైపు..

ఈద్ సెలవుల నేపథ్యంలో తక్కువ ఖర్చుతో, కనీస డాక్యుమెంటేషన్‌తో ప్రయాణించే వీలున్న ఆసియా, మధ్యప్రాచ్య దేశాలపై భారతీయులు మక్కువ చూపుతున్నారు. ముఖ్యంగా థాయ్‌లాండ్, మలేషియా, మాల్దీవులు వంటి దేశాలు వీసా సరళీకరణను ప్రకటించడంతో బుకింగ్స్ ఒక్కసారిగా ఊపందుకున్నాయి. ర్యాంకింగ్‌లో స్వల్ప మార్పు ఉన్నప్పటికీ, ఇది మన పాస్‌పోర్ట్ బలహీనత కంటే ఇతర దేశాల వీసా విధానాల్లో వస్తున్న మార్పుల వల్ల సంభవించినదేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. విదేశీ ప్రయాణం చేయాలనుకునే వారు సంబంధిత దేశ ఇమ్మిగ్రేషన్ నిబంధనలను ఒకసారి సరిచూసుకోవడం ఉత్తమం.

నా వైఫ్ మిస్సింగ్

వరుణ్ సందేశ్ హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'నా వైఫ్ మిస్సింగ్' అనే టైటిల్ ఖరారైంది. 'నయనం' వెబ్ సిరీస్ ఫేమ్ దర్శకురాలు స్వాతి ప్రకాశ్ మంత్రిప్రగడ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఆహా సమర్పణలో కొమర మీడియా వర్క్స్ పతాకంపై శివ కంఠంనేని, ఆర్. వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి నటుడు–నిర్మాత, ఫిల్మ్ చాంబర్ సెక్రటరీ అశోక్ కుమార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత సి. కల్యాణ్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు నీలకంఠ గౌరవ దర్శకత్వం వహించారు. "సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్‌లో చక్కటి ప్రేమకథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం" అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సాయికార్తీక్, కెమెరా: సతీష్ కుమార్ ఎన్ఎస్.



'పెద్ది' ట్రైలర్ రిలీజ్‌డేట్ ఫిక్స్

మెగా అభిమానులకు గుడ్ న్యూస్. 'పెద్ది' ట్రైలర్ రిలీజ్ అప్‌డేట్ వచ్చేసింది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇది. జాన్వీ కపూర్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ప్రచార కార్యక్రమాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా మే 18న 'పెద్ది' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది. పాన్ ఇండియా మూవీగా 'పెద్ది'ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. వాటిని మించేలా ట్రైలర్ ఉంటుందని ఇన్‌సైడ్ టాక్. మరోవైపు సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఏఆర్ రెహమాన్ నేపథ్య సంగీతం మరో స్థాయిలో ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం బుచ్చిబాబు ఇటు ట్రైలర్‌ను సిద్ధం చేయడంతో పాటు, అటు మూవీ ఫైనల్ కట్‌ను కూడా రెడీ చేస్తున్నారట. సెన్సార్ ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే తగిన విధంగా చిత్ర బృందం ముందుకు సాగుతోంది. ప్రచార కార్యక్రమాలను కూడా భారీగా చేయాలని యోచిస్తున్నారు. రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, దివ్యేందు, జగపతిబాబు, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రుతిహాసన్ స్పెషల్ సాంగ్‌లో మెరవనున్నట్లు సమాచారం.

ప్రేమ ఎప్పుడూ గొప్పదే.. విజయ్ సీఎం అయ్యాక త్రిష తొలి పోస్ట్

తమిళనాడులో నెలకొన్న ఉత్కంఠకు తెర దించుతూ.. ముఖ్యమంత్రిగా టీవీకే అధినేత విజయ్ ఆదివారం ఉదయం ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమంలో నటి త్రిష సందడి చేశారు. సంప్రదాయ చీరకట్టులో నీలం రంగు పట్టుచీరలో హుందాగా కనిపించిన త్రిష అందరి దృష్టిని ఆకర్షించారు. విజయ్ ప్రమాణస్వీకారం అనంతరం ఆమె తాజాగా ప్రేమ గురించి పోస్ట్ పెట్టారు. "ప్రేమ ఎప్పుడూ గొప్పగానే వ్యక్తమవుతుంటుంది" అంటూ నీలిరంగు హార్ట్ ఏమోజీని జోడించారు. తనకెంతో ఇష్టమైన తన టీమ్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఆమె పంచుకున్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. విజయ్‌తో త్రిష ఐదు సినిమాల్లో నటించారు. అవి హిట్‌గా నిలవడమే కాకుండా ఇద్దరి కెరీర్‌ను మలుపుతిప్పాయి. తొలి సినిమా సమయంలోనే ఇద్దరూ మంచి స్నేహితులు అయ్యారు. ఆదివారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలోనూ విజయ్ ప్రమాణం చేస్తుండగా ఆమె కొంచెం భావోద్వేగానికి గురయ్యారు.

బోల్డ్ పాత్రలో డింపుల్.. భోగి లుక్ రిలీజ్

భిన్న కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు దర్శకుడు సంపత్ నంది సిద్ధమవుతున్నారు. ఆయన దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా రానున్న చిత్రం 'భోగి'. ఆగస్టు 28న విడుదల కానుంది. ఇప్పటికే హీరో, హరోయిన్ లుక్స్‌తో అంచనాలు కలిగించిన ఆయన తాజాగా ఇందులో కీలకపాత్రలో నటిస్తోన్న డింపుల్ హయాతి లుక్‌ను పంచుకున్నారు. ఇందులో ఆమె మందారం అనే పాత్రలో కనిపించనున్నట్లు దర్శకుడు చెప్పారు. ఎవరినీ లెక్కచేయని ఓ బోల్డ్ పాత్రలో ఆమె నటిస్తున్నట్లు తెలిపారు. 'ప్రపంచానికి ఆమె సౌందర్యం కావాలి. కానీ, ఆమె మనసును ఎవరూ అర్థం చేసుకోరు' అనే క్యాప్షన్‌తో డింపుల్ లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు.ఇటీవలే అనుపమ పరమేశ్వరన్ పాత్రను కూడా టీమ్ పరిచయం చేసింది. ఇందులో (Bhogi) ఆమె 'కందుల సులోచన రాణి'గా కనిపించనున్నారు. 'ప్రకృతి బిడ్డ.. గంగమ్మ నిలయం.. కందుల వారి గర్వం.. భోగి చిత్రానికి ఆమె ప్రాణం' అని ఆ పాత్రను పరిచయం చేశారు. ఉత్తర తెలంగాణ - మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ కథని పాన్ ఇండియా స్థాయిలో తెర పైకి తీసుకొస్తున్నారు.

'వారణాసి' లేటెస్ట్ షెడ్యూల్ మళ్లీ మొదలైంది... సెట్స్ పై ప్రియాంక చోప్రా!

సూపర్‌స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'వారణాసి'పై కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో నటిస్తున్న గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా తాజా షెడ్యూల్ లో షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు."వారణాసి, హియర్ వి గో!" అనే క్యాప్షన్‌తో ఆమె ఒక ఫోటోను పోస్ట్ చేయడంతో, కొత్త షెడ్యూల్ ప్రారంభమైనట్లు అధికారికంగా వెల్లడైంది. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో నీటి కొరత కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయిన షూటింగ్‌ను ఇప్పుడు పునఃప్రారంభించారు. తాజా అప్‌డేట్‌తో ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి.ఈ సినిమాలో మహేష్ బాబు సరసన ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరితో పాటు మాధవన్, ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖ నటులు కూడా ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. ఎస్.ఎస్. కార్తికేయ, కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 2027 ఏప్రిల్ 7న ఈ సినిమాను విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.

మోదీని ముట్టుకున్నా.. నా జన్మ ధన్యం: తనికెళ్ల భరణి

ప్రధాని నరేంద్ర మోదీ తో కలిసి దిగిన ఫొటోను పంచుకుంటూ ఎమోషనల్ పోస్టు పెట్టారు నటుడు తనికెళ్ల భరణి . "నేను రాముణ్ని చూడలేదు. కృష్ణుణ్ని చూడలేదు. ఆదిశంకరుల్ని చూడలేదు. వివేకానందుణ్ని చూడలేదు. చూడలేం కూడా. కానీ, వాళ్లందరి అంశలతో ఉన్న మోదీ గారిని చూశాను, ముట్టుకున్నాను, ఆయన చేతిని ముద్దెట్టుకున్నాను. నా జన్మ ధన్యం" అని పేర్కొన్నారు. మోదీ హైదరాబాద్‌లో ఆదివారం పర్యటించిన సంగతి తెలిసిందే. విమానాశ్రయంలో ఆయన్ను కలిశారు తనికెళ్ల భరణి.

చిరంజీవి 'విశ్వంభర' రెండు పార్టులా? "నిజమా" అంటూ దర్శకుడి సెటైర్!

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న భారీ చిత్రం 'విశ్వంభర'పై సోషల్ మీడియాలో వస్తున్న ఓ కీలక ప్రచారానికి దర్శకుడు వశిష్ట తెరదించారు. ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయనున్నారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఈ సినిమా విడుదలపై నెలకొన్న ఓ ప్రధాన సందేహానికి తెరపడినట్లయింది. 'విశ్వంభర' రెండు భాగాలుగా రాబోతోందంటూ ఇటీవల ప్రచారం జోరుగా సాగింది. దీనిపై ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు దర్శకుడు వశిష్ట స్పందిస్తూ.. "ఓహో, నిజమేనా?" అని వ్యంగ్యంగా బదులిచ్చారు. ఆయన సమాధానంతో ఈ చిత్రం ఒకే భాగంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తేలిపోయింది.వశిష్ట దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. సోషియో ఫాంటసీ కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాలో చిరంజీవి సరసన త్రిష కథానాయికగా నటిస్తున్నారు. సృష్టి, స్థితి, లయ అనే అంశాల చుట్టూ ఈ కథ సాగుతుందని సమాచారం. ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి దీనికి సంగీతం అందిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి.ఈ చిత్రంలో ఆషిక రంగనాథ్, రమ్య పసుపులేటి, ఇషా చావ్లా వంటి ఇతర తారలు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వాస్తవానికి ఈ సినిమాను ఎప్పుడో విడుదల చేయాలని భావించినా, చిత్రీకరణలో జాప్యం కారణంగా వాయిదా పడింది. ప్రస్తుతం సినిమా షూటింగ్ ఏ దశలో ఉందనే దానిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ప్లేఆఫ్ బెర్తుపై గురి

అహ్మదాబాద్: ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకోవడంతో ప్లేఆఫ్ రేసు రసవత్తరంగా మారింది. ప్లేఆఫ్స్ బెర్తే లక్ష్యంగా మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. 11 మ్యాచ్‌ల్లో 7 విజయాలతో 14 పాయింట్లు నెగ్గి పట్టికలో రెండో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్‌కు మరో గెలుపు ప్లేఆఫ్స్ బెర్తును దాదాపుగా ఖాయం చేస్తుంది. సరిగ్గా అవే గణాంకాలతో మూడో స్థానంలో ఉన్న గుజరాత్‌దీ అదే పరిస్థితి. దీంతో సమవుజ్జీల పోరు ఫలితం ప్లేఆఫ్స్ సమీకరణంలో కీలకం కానుంది. ప్రస్తుతం బెంగళూరు, సన్‌రైజర్స్, గుజరాత్ తలో 14 పాయింట్లతో వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉండటంతో నెట్ రన్‌రేట్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. చిన్న పొరపాటు జరిగినా రేసులో వెనుకబడే ప్రమాదం ఉండటంతో ఇరుజట్లు ఈ మ్యాచ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకొంటున్నాయి. కమిన్స్ సారథ్యంలో బ్యాటింగ్, బౌలింగ్‌లో సమతూకంగా ఉండటం సన్‌రైజర్స్ అతిపెద్ద బలం. బ్యాటింగ్‌లో అభిషేక్‌శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీశ్‌కుమార్‌రెడ్డి.. బౌలింగ్‌లో కమిన్స్, ఇషాన్ మలింగ, సాకిబ్ హుస్సేన్, శివాంగ్‌కుమార్ మంచి ఫామ్‌లో ఉండటం ఆ జట్టుకు కలిసొచ్చేదే. ఇక సీజన్ ఆరంభంలో తడబడిన గుజరాత్.. వరుస విజయాలతో పుంజుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ టాప్ ఆర్డర్‌లో నిలకడగా రాణిస్తుండటం గుజరాత్ ప్రధాన బలం. బట్లర్, వాషింగ్టన్ సుందర్‌ల బ్యాటింగ్ జట్టుకు కలిసొస్తోంది. రబాడ, మహ్మద్ సిరాజ్‌ల పేస్.. రషీద్‌ఖాన్ స్పిన్ గుజరాత్ విజయాల్లో కీలకంగా మారింది. అయితే టాప్ ఆర్డర్ విఫలమైనప్పుడు ఫినిషర్లపైనే అతిగా ఆధారపడటం ఆ జట్టు బలహీనతగా కనిపిస్తోంది.

పంజాబ్ మళ్లీ.. దిల్లీ క్యాపిటల్స్ విజయం

పంజాబ్! ఈ ఐపీఎల్ ప్రథమార్ధంలో అదిరే ఆటతో అందరి దృష్టినీ తనవైపే తిప్పుకొన్న ఆ జట్టు.. అనూహ్యంగా దెబ్బతింటోంది. వరుస విజయాలతో అందరికన్నా ముందే అలవోకగా ప్లేఆఫ్స్ చేరేలా కనిపించిన పంజాబ్, ఇప్పుడు ఇబ్బందుల్లో పడింది. వరుసగా నాలుగో ఓటమితో టోర్నీలో ముందంజ వేసేందుకు పోరాడాల్సిన స్థితికి చేరుకుంది. అక్షర్, మిల్లర్ మెరుపులతో పంజాబ్‌ను దిల్లీ ఓడించింది. 12 మ్యాచ్‌ల్లో అయిదు విజయాలు సాధించిన దిల్లీ.. సాంకేతికంగానైనా తన ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది.

ధర్మశాల

దిల్లీ క్యాపిటల్స్ అదరగొట్టింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో పంజాబ్‌పై విజయం సాధించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (59 నాటౌట్; 36 బంతుల్లో 5×4, 3×6), ప్రియాంశ్ ఆర్య (56; 33 బంతుల్లో 2×4, 6×6) మెరవడంతో మొదట పంజాబ్ కింగ్స్ 5 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. అక్షర్ పటేల్ (56; 30 బంతుల్లో 8×4, 2×6), మిల్లర్ (51; 28 బంతుల్లో 3×4, 4×6) చెలరేగడంతో లక్ష్యాన్ని దిల్లీ 19 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 11 మ్యాచ్‌ల్లో పంజాబ్‌కు ఇది నాలుగో ఓటమి.

దిల్లీ తడబాటు: ఛేదనలో దిల్లీ తడబడింది. ఆరంభం పేలవం. 33కే మూడు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. రెండో ఓవర్లోనే అభిషేక్ పోరెల్ (5)ను ఔట్ చేసి దిల్లీ పతనాన్ని యశ్ ఆరంభించగా.. అర్ష్‌దీప్ వరుస ఓవర్లలో మరో ఓపెనర్ రాహుల్ (9), సాహిల్ పరాఖ్ (13)ను వెనక్కి పంపి ఆ జట్టును దెబ్బతీశాడు. ఆ దశలో స్టబ్స్ (12; 17 బంతుల్లో 1×4)తో కలిసి అక్షర్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. చకచకా బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును నడిపించాడు. స్టబ్స్ మాత్రం షాట్లు కొట్టేందుకు ఇబ్బందిపడ్డాడు. పరుగుల కోసం చెమటోడ్చాడు. చివరికి జోరందుకోకుండానే రనౌటయ్యాడు. సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ పోయింది. ఆఖరి 10 ఓవర్లలో దిల్లీ 124 పరుగులు చేయాల్సిన పరిస్థితి. అవసరానికి తగ్గట్లు మిల్లర్ కూడా చెలరేగకపోయినా.. అక్షర్ ధనాధన్ బ్యాటింగ్‌ను కొనసాగించాడు. డ్వార్షుయిస్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన అతడు.. స్టాయినిస్ ఓవర్లో వరుసగా 4, 4, 4 బాదేశాడు. కానీ అక్షర్ అదే ఊపులో ఆడబోయి క్యాచ్ ఔటయ్యాడు. ఆ తర్వాత జోరందుకున్న మిల్లర్ ఓ సిక్స్, ఫోర్.. అశుతోష్ ఓ ఫోర్ బాదడంతో యాన్సెన్ 15 పరుగులు సమర్పించుకున్నాడు. ఆఖరి నాలుగు ఓవర్లలో దిల్లీకి 53 పరుగులు అవసరం కాగా.. డ్వార్షుయిస్ బౌలింగ్‌లో మిల్లర్ వరుసగా రెండు సిక్స్‌లు బాది మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చేశాడు. తర్వాతి బంతికే అతడు ఔటైనా.. పంజాబ్ పైచేయి సాధించలేకపోయింది. అశుతోష్ (24; 10 బంతుల్లో 2×4, 2×6), మాధవ్ తివారి (18 నాటౌట్; 8 బంతుల్లో 2×4, 1×6) జోరుతో 19 ఓవర్లకే దిల్లీ విజయాన్నందుకుంది. 18వ ఓవర్లో స్టాయినిస్ 19 పరుగులివ్వడం పంజాబ్‌ను దెబ్బతీసింది. ఆఖరి రెండు ఓవర్లలో దిల్లీకి 17 పరుగులు అవసరమయ్యాయి. అయితే 19వ ఓవర్లో తొలి నాలుగు బంతుల్లోనే ఠాకూర్ 11 పరుగులిచ్చాడు. అయిదో బంతికి అశుతోష్ వెనుదిరిగినా.. ఆరో బంతి నోబాల్ కావడం, దాన్ని ఆకిబ్ (10 నాటౌట్) ఫోర్ కొట్టడంతో స్కోర్లు సమమమయ్యాయి. ఆ వెంటనే ఆకిబ్ సిక్స్ కొట్టి పని పూర్తి చేశాడు.

పంజాబ్ కట్టడి: 210/5. మొదట పంజాబ్ చేసిన పరుగులివి. మంచి స్కోరే అనిపించవచ్చు. కానీ ఆ జట్టుకు లభించిన ఆరంభం ప్రకారం చూస్తే తక్కువే. పంజాబ్ ఓపెనర్ల విధ్వంసాన్ని తట్టుకుని బంతితో పుంజుకున్న దిల్లీ.. ప్రత్యర్థిని కట్టడి చేసిందనే చెప్పాలి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌కు ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య కళ్లు చెదిరే ఆరంభాన్నిచ్చాడు. నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డ అతడు.. ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే రెండు సిక్స్‌లు బాదడం ద్వారా అతడు తన ఉద్దేశాన్ని చాటిచెప్పాడు. ఆ ఓవర్లో స్టార్క్ 22 పరుగులు సమర్పించుకున్నాడు. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (18) దాటిగా ఆడలేక పోయినా.. ప్రియాంశ్ సిక్స్‌ల మోత కొనసాగించడంతో పంజాబ్ మూడు ఓవర్లకే 51/0తో భారీ స్కోరుపై కన్నేసింది. అయితే ఆ జోరును ఎంతో సేపు కొనసాగించలేకపోయింది. ప్రియాంశ్ విధ్వంసం సృష్టించినా.. నబి మెరుగ్గానే బౌలింగ్ చేశాడు. తన తొలి మూడు ఓవర్లలో 22 పరుగులే ఇచ్చాడు. ఏడో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ నిష్క్రమించేటప్పటికి పంజాబ్ స్కోరు 78. కాసేపటికే ప్రియాంశ్ కూడా వెనుదిరిగాడు. ఆ తర్వాత శ్రేయస్ అయ్యర్ అడపా దడపా బౌండరీలు బాదినా.. మరో ఎండ్‌లో కనోలీ బ్యాట్ ఝుళిపించలేక పోవడంతో పంజాబ్ స్కోరు వేగం సన్నగిల్లింది. కనోలి తన తొలి 18 బంతుల్లో 19 పరుగులే చేశాడు. 15 ఓవర్లు ముగిసే సరికి 149/2తో నిలిచింది పంజాబ్. దిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పంజాబ్ ఆఖర్లో కూడా ఆశించినంత జోరందుకోలేకపోయింది. ఆఖరి అయిదు ఓవర్లలో పంజాబ్ 3 వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసింది. సుయాంశ్ (21 నాటౌట్; 8 బంతుల్లో 2×4, 2×6) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. కనోలీ (38; 27 బంతుల్లో 3×4, 2×6)తో మూడో వికెట్‌కు శ్రేయస్.. 83 పరుగులు జోడించాడు. స్టార్క్ రెండు వికెట్లు పడగొట్టినప్పటికీ, 4 ఓవర్లలో 57 పరుగులిచ్చాడు. ముకేశ్ (1/31), నబి (0/32) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు.

స్కోరు వివరాలు

పంజాబ్ ఇన్నింగ్స్: ప్రియాంశ్ ఆర్య (సి) సాహిల్ (బ) తివారి 56; ప్రభ్‌సిమ్రన్ (సి) ఆకిబ్ నబి (బ) ముకేశ్ 18; శ్రేయస్ అయ్యర్ నాటౌట్ 59; కనోలీ (సి) మిల్లర్ (బ) మాధవ్ 38; స్టాయినిస్ (సి) మాధవ్ (బ) స్టార్క్ 1; శశాంక్ సింగ్ (సి) అక్షర్ (బ) స్టార్క్ 0; సుయాంశ్ నాటౌట్ 21; ఎక్స్‌ట్రాలు 17 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 210; వికెట్ల పతనం: 1-78, 2-97, 3-180, 4-187, 5-187; బౌలింగ్: స్టార్క్ 4-0-57-2; ఆకిబ్ నబి 4-0-32-0; ఎంగిడి 4-0-46-0; ముకేశ్ 4-0-31-1; మాధవ్ తివారి 4-0-40-2

దిల్లీ ఇన్నింగ్స్: రాహుల్ (సి) యాన్సెన్ (బ) అర్ష్‌దీప్ 9; పోరెల్ (బ) యశ్ ఠాకూర్ 5; సాహిల్ (సి) చాహల్ (బ) అర్ష్‌దీప్ 13; స్టబ్స్ రనౌట్ 12; అక్షర్ (సి) డ్వార్షు యిస్ (బ) స్టాయినిస్ 56; మిల్లర్ (సి) ప్రభ్‌సిమ్రన్ (బ) డ్వార్షు యిస్ 51; అశుతోష్ (సి) ప్రవీణ్ దూబె (బ) యశ్ ఠాకూర్ 24; మాధవ్ తివారి నాటౌట్ 18; ఆకిబ్ నబి నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 18 మొత్తం: (19 ఓవర్లలో 7 వికెట్లకు) 216; వికెట్ల పతనం: 1-10, 2-14, 3-74, 4-74, 5-138, 6-170, 7-205; బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-21-2; యశ్ ఠాకూర్ 4-0-55-2; యాన్సెన్ 4-0-45-0; డ్వార్షు యిస్ 4-0-51-1; స్టాయినిస్ 3-0-44-1

సీసీ వన్డే వార్షిక ర్యాంకింగ్స్..

అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్న భారత్

సీసీ వన్డే వార్షిక ర్యాంకింగ్స్‌ను ప్రకటించగా.. టీమ్‌ఇండియా అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 118 రేటింగ్ పాయింట్లలో భారత్ టాప్‌లో ఉంది. న్యూజిలాండ్ (113), ఆస్ట్రేలియా (109) రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. పాకిస్థాన్ (95)ను అధిగమించి సౌతాఫ్రికా (102) టాప్ 4లోకి దూసుకెళ్లింది. శ్రీలంక (96), అఫ్గానిస్థాన్ (93), ఇంగ్లాండ్ (89), బంగ్లాదేశ్ (84), వెస్టిండీస్ (74) పాయింట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఐసీసీ నిబంధనల ప్రకారం గత మూడేళ్లలో జరిగిన మ్యాచ్‌ల ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ వివరాలను వెల్లడించారు. మే 2025 నుంచి జరిగిన మ్యాచ్‌లకు 100 శాతం, అంతకు ముందు రెండేళ్ల మ్యాచ్‌లకు 50 శాతం పాయింట్ల వెయిటేజీని ఇచ్చారు.

ఫార్మాట్‌లో మార్పులు

2023 ప్రపంచ కప్‌ను రౌండ్‌రాబిన్ ఫార్మాట్‌లో నిర్వహించగా 10 జట్లు పోటీపడ్డాయి. కానీ, వచ్చే ప్రపంచ కప్ కోసం ఫార్మాట్‌లో మార్పులు చేశారు. మొత్తం 14 జట్లు పోటీపడనున్నాయి. 14 జట్లను ఏడు జట్ల చొప్పున రెండు గ్రూప్‌స్‌గా విభజిస్తారు. ప్రతి గ్రూపు నుంచి అగ్రస్థానంలో నిలిచిన మూడు జట్లు సూపర్ సిక్స్ దశకు చేరుకుంటాయి. ఆ తర్వాత సెమీఫైనల్స్, ఫైనల్ నిర్వహిస్తారు. మార్చి 31, 2027 వరకు ర్యాంకింగ్‌స్‌లో టాప్ 8లో ఉన్న జట్లు నేరుగా అర్హత సాధిస్తాయి. 2027 వరల్డ్ కప్‌నకు ఆతిథ్యమివ్వనున్న సౌతాఫ్రికా, జింబాబ్వే ఆటోమేటిక్‌గా అర్హత సాధిస్తాయి. మిగిలిన జట్లను 2027లో జరిగే ప్రపంచ క్వాలిఫైయర్ టోర్నమెంట్ ద్వారా నిర్ణయిస్తారు. నమీబియా సహఆతిథ్య దేశమైనప్పటికీ ఐసీసీ పూర్తి సభ్యత్వం లేని కారణంగా నేరుగా అర్హత సాధించదు.

నాకు అర్హత ఉంది

గొండా (ఉత్తర్ ప్రదేశ్): జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్లో పోటీ పడాలనుకుంటున్న రెజ్లర్ వినేశ్ ఫొగాట్ సోమవారం గొండా చేరుకుంది. పోటీ పడేందుకు తాను అర్హురాలినేని పేర్కొంటూ ఆమె.. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్) షోకాజ్ నోటీసుకు జవాబు పంపింది. రిటైర్మెంట్ నుంచి వచ్చిన వాళ్లు ఆరు నెలలు నోటీసు కాలంలో ఉండడం తప్పనిసరని చెబుతూ, జూన్ 26 వరకు పోటీపడేందుకు వినేశ్ అనర్హురాలని డబ్ల్యూఎఫ్ఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయినా సరే, ర్యాంకింగ్స్ టోర్నీలో ఆడేందుకు వినేశ్.. గొండాకు వెళ్లింది. అయితే రిటైర్మెంట్‌ను వీడి, తిరిగి పోటీలకు హాజరు కావాలని నిర్ణయించుకున్నట్లు గత జూన్‌లోనే యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ)కు సమాచారమిచ్చినందున ఆరు నెలల నిబంధన తనకు వర్తించదని డబ్ల్యూఎఫ్ఐకి ఇచ్చిన జవాబులో ఆమె పేర్కొంది. ఆమె జవాబుకు డబ్ల్యూఎఫ్ఐ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. అర్హత గురించి మాత్రమే వినేశ్ స్పందించిందని, క్రమశిక్షణ ఉల్లంఘన అభియోగాలకు బదులివ్వలేదని సమాఖ్య వర్గాలు పేర్కొన్నాయి. ''ఆమె జవాబు సంతృప్తికరంగా లేదు. షోకాజ్ నోటీసుకు ఆమె పూర్తిగా స్పందించలేదు. వినేశ్ క్రమశిక్షణరాహిత్యంపై విచారణ జరిపి, ఒక నిర్ణయం తీసుకునేంతవరకు పోటీపడేందుకు ఆమెకు అనుమతి లభించదు'' అని ఓ డబ్ల్యూఎఫ్ఐ అధికారి చెప్పాడు. వినేశ్ వేదిక వద్దకు వచ్చినా.. పోటీ పడేందుకు సమాఖ్య ఆమెకు అనుమతివ్వలేదు. దీంతో తన పునరాగమనాన్ని అడ్డుకునేందుకు కుట్ర జరుగుతోందని ఆమె వ్యాఖ్యానించింది.

ధోనీ ఇచ్చిన సలహాతోనే మెరుపు ఇన్నింగ్స్: ఉర్విల్ పటేల్

లఖ్‌నవూ సూపర్ జెయింట్‌స్‌తో మ్యాచ్‌కు ముందు డ్రెస్సింగ్ రూమ్‌లో ధోనీతో మాట్లాడానని, అతడితో జరిపిన సంభాషణ తనను పునరుత్తేజ పరిచిందని సీఎస్కే బ్యాటర్ ఉర్విల్ పటేల్ చెప్పాడు. చెపాక్ స్టేడియంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్‌స్‌పై సీఎస్కే బ్యాటర్ ఉర్విల్ పటేల్ 13 బంతుల్లోనే అర్ధశతకం బాదిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఐపీఎల్‌లో చరిత్రలోనే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేసిన యశస్వి జైస్వాల్ రికార్డును ఉర్విల్ సమం చేశాడు.

''గత రెండు మ్యాచుల్లో నేను తొందరగా ఔటైన తర్వాత నేను డ్రెస్సింగ్ రూమ్‌లో 'మహీ భాయ్' పక్కన కూర్చున్నాను. 'భయ్యా.. నాకు మంచి ఆరంభాలు లభిస్తున్నాయి. కానీ, నేను ఔటైపోతున్నాను. వాటిని పెద్ద స్కోర్లుగా మలచడానికి నేనేం చేయాలి?' అని అడిగాను. దానికి మహీ భాయ్ నాతో ఒకే ఒక్క విషయం చెప్పారు. 'నీ నైపుణ్యాల పట్ల నాకు ఎలాంటి సందేహమూ లేదు. ఏ సందేహం ఉన్నా అది కేవలం నీ మనసులోనే ఉంది. నువ్వు మానసికంగా స్పష్టతతో ఉంటూ బంతిని సరైన ప్రదేశాలకు కొట్టడానికి ప్రయత్నించు'' అని ధోనీ సలహా ఇచ్చాడని ఉర్విల్ (Urvil Patel) పేర్కొన్నాడు. ఈ హాఫ్ సెంచరీని ఉర్విల్ తన తండ్రికి అంకితం చేశాడు. అర్ధ శతకం పూర్తికాగానే సంబరాలు చేసుకుంటూ తన జేబులో నుంచి ఓ పేపర్ తీశాడు. 'నాన్న ఇది నీ కోసమే..' అని దానిపై ఉంది. ''నువ్వు బ్యాటింగ్ చేస్తున్న తీరు నాకు చాలా నచ్చింది. ఇలాగే ఆడుతూ ఉండు. నువ్వు పరుగులు సాధించినా, సాధించకపోయినా నాకేమీ ఫర్వాలేదు. స్వేచ్ఛగా ఆడు, నీ నుంచి మేము ఏమీ ఆశించడం లేదు. నువ్వు ఈ స్థాయిలో ఉన్నందుకు మాకు గర్వంగా ఉందని ఆయన నాతో చెబుతుంటారు'' అని తన తండ్రి అన్న మాటలను ఉర్విల్ గుర్తు చేసుకున్నాడు.

భారత షట్లర్లకు పరీక్ష

బ్యాంకాక్: థామస్ కప్ ఫైనల్స్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన భారత షట్లర్లు మరో పరీక్షకు సిద్ధమయ్యారు. మంగళవారం ప్రారంభం కానున్న థాయ్‌లాండ్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో జేసన్ హెంగ్ (సింగపూర్)తో లక్ష్యసేన్, లో కీన్ యూ (సింగపూర్)తో కిదాంబి శ్రీకాంత్, కొడయ్ నరవొక (జపాన్)తో ఆయుష్ శెట్టి, కొకి వతనబె (జపాన్)తో తరుణ్ మన్నెపల్లి తలపడనున్నారు. మహిళల సింగిల్స్‌లో సియో టాంగ్ (చైనీస్ తైపీ)తో పి.వి.సింధు, పోర్న్‌పావీ (థాయ్‌లాండ్)తో ఉన్నతి హుడా, నత్సుకి (జపాన్)తో దేవిక సిహాగ్, హినా అకెచి (జపాన్)తో తన్విశర్మ, వెన్ జాంగ్ (కెనడా)తో మాళవిక బాన్సోద్ తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో పుత్ర ఇర్వియన్‌స్యా బాగాస్ మౌలానా (ఇండోనేసియా)తో సాత్విక్ సాయిరాజ్ చిరాగ్‌శెట్టి.. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో సుపాక్ జోమ్‌కో ఓర్నిచా (థాయ్‌లాండ్)తో రోహన్ కపూర్ గద్దె రుత్విక శివాని పోటీపడనున్నారు.